PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 29-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 30 Issue: 30

Circulated to Telangana Published from Jagitial

29 జూలై 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి పౌర్ణమి రా. 8:03 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ మ. 3:26 వరకు తరువాత శ్రవణ యోగం ప్రీతి రా. 11:55 వరకు కరణం విష్టి ఉ. 7:14 వరకు బవ రా. 8:03 వరకు వర్జ్యం రా. 7:58 నుండి రా. 9:42 వరకు దుర్ముహూర్తం ఉ. 11:57 నుండి మ. 12:48 వరకు రాహుకాలం మ. 12:22 నుండి మ. 1:58 వరకు యమగండం ఉ. 7:34 నుండి ఉ. 9:10 వరకు గుళికాకాలం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు ఉ. 8:34 నుండి ఉ. 10:19 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున




# కొట్టి కొట్టి.. కాల్చి చంపుతున్నారు!

## 24 గంటల్లో 20 మంది కశ్మీరీల హత్య

### పీవోకేలో పాకిస్థాన్ ఆర్మీ క్రూరత్వం.. 50 రోజుల్లో మొత్తం 80 మంది మృతి

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్యమాన్ని ఉక్కుపాదం అణచివేయడానికి దాయాది దేశం క్రూరంగా వ్యవహరిస్తోంది. పీవోకేలో ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన స్థానికులపై క్రూరత్వానికి పాల్పడుతోంది. ముజఫర్‌పూర్ లాంగ్ మార్చ్‌కు ముందు నిరసనకారులపై పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో గత 24 గంటల్లో కనీసం 20 మంది కశ్మీరీలు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు.

రావల్‌కోట్: రావల్కోట్‌లోని డ్రైక్ వద్ద నిరసనకారు లను పాక్ బలగాలు లక్ష్యంగా చేసుకోవడంతో హింస చెలరేగినట్లు సమాచారం. ఎన్నికలను బహిష్కరణకు పిలుపునిచ్చిన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) కోర్ కమిటీ సభ్యుడు, అధికార ప్రతినిధి ఉమర్ నజీర్ కశ్మీరీ సోదరుడు ఉస్మాన్ నజీర్‌తో సహా 20 మందిని భద్రతా దళాలు హతమార్చినట్లు వర్గాలు తెలిపాయి. దీంతో జూన్ 5 నుంచి పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 80కి చేరుకుంది. గుమిగూడి ఉన్న నిరసనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరపడంతో తరువాయి 2 వ పేజీలో...



# జాన్సన్ బేబీ పౌడర్.. రూ.52,700 వేల కోట్లు!


### చెల్లింపునకు జాన్సన్ అండ్ జాన్సన్ అంగీకారం

### అమెరికా కోర్టుల్లో 76,000 పిటిషన్లు



జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి చెందిన బేబీ పౌడర్, టాల్కం పౌడర్లు ఉపయోగించడం ద్వారా అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయంటూ దాఖలైన వ్యాజ్యాలను పరిష్కరించుకొనేందుకు ఆ కంపెనీ సిద్ధమైంది. దశాబ్దానికిపైగా సాగిన కేసులో పిటిషనర్లకు ఏకంగా 5.5 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.52,700 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది.

న్యూయార్క్: ఏళ్లకు ఏళ్లుగా కొనసాగుతున్న చట్టపరమైన వివాదానికి తెరదించాలని నిర్ణ యించింది. మరి ఈ వివాదానికి సంబంధించి న వివరాలు తెలుసుకుందాం. అమెరికావ్యాప్తం గా ఉన్న కోర్టుల్లో జాన్సన్ అండ్ జాన్సన్ పౌడ ర్లపై 76 వేల పిటిషన్లు దాఖలయ్యాయి. వారి లో 95 శాతం మంది పిటిషనర్లు ఈ డీల్‌కు అంగీకరిస్తే కంపెనీ రూ.52,700 కోట్లు చెల్లిం చేందుకు అవకాశం లభిస్తుంది. లేదంటే మరి న్ని వ్యాజ్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. తమ టాల్కం ఆధారిత పౌడర్లు, ఇతర ఉత్పత్తులు సురక్షితమైనవని తరువాయి 2 వ పేజీలో...




# మహిళలు, పిల్లల భద్రతకు చర్యలేవి?


### ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్‌కు కేంద్రం నోటీసులు.. ఆగస్టు 3 సమావేశానికి హాజరుకావాలని ఆదేశం

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, స్నాప్‌చాట్ గూగుల్ వంటి పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. డేటా ప్రైవసీ, ఇతర రూల్స్ పై వివరణ ఇవ్వాలని ఈ మేరకు కంపెనీలను ఆదేశించింది. ఈ అంశాలపై చర్చించేం దుకు ఆగస్టు 3వ తేదీన సోషల్ మీడియా ప్రతినిధులతో పార్లమెంటరీ కమిటీ సమావేశం కానుందని కేంద్రం తెలిపింది. ఈ మేరకు కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు.

న్యూఢిల్లీ: 'ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టా, గూగుల్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి సోషల్ మీడియా కంపెనీలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. వినియోగదారుల వ్యక్తిగత భద్రతకు, డేటా గోప్యత కోసం అమలు చేస్తున్న నిబంధనలపై ఆ కంపెనీల ప్రతినిధు లు వివరణ ఇవ్వాలని కేంద్రం ఆదేశిం చింది. మహిళలు, -2 వ పేజీలో...

# నేర చరిత్రలేని సీజేపీలను విడుదల చేయండి

### రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు



నీట్-యూజీ 2026 పేపర్ లీక్ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూకాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపైఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని సుప్రీంకోర్టు మంగళవారం రాష్ట్రాలను ఆదేశించింది. పోలీసులు ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేయవచ్చని, కానీ ప్రస్తుతానికి ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని కోర్టు స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: అంతేకాదు, గతంలో ఎలాంటి నేర చరిత్ర లేని వారిని విడుదల చేయాలని కూడా ఆదేశించింది. అయితే, నేర చరిత్ర ఉన్న వ్యక్తులను కోర్టు మినహాయించింది. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చనేది మాత్రం స్పష్టం చేయలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ సీజేపీ ప్రారంభించిన నిరసనలు ఆ తర్వాత మహారాష్ట్ర, బిహార్, గుజరాత్, అస్సాం, తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,417 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,900 |

# తప్పంతా కేసీఆర్‌దే

### బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఫీజు బకాయిలు

### గ్లోబరీనా అక్రమాలపై చర్యలు తీసుకోలేదు.. దాంతో పేపర్ లీకేజీలు దేశానికి పాకినయ్

### హైడ్రా పనులు కొనసాగి తీరుతాయ్.. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 29: తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పేపర్ లీకేజీలకు కేసీఆర్ ప్రభుత్వమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు సమస్యలు తక్కువగా ఉంటున్నాయని, ఆఫ్‌లైన్ పరీక్షల్లోనే లీకేజీలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సీఎం, అనుమతులు లేకుండా దేశవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా కోచింగ్ తరువాయి 2 వ పేజీలో...

# తడిసిముద్దైన నేలమ్మ

### ఈ ఏడాది తొలిసారి భారీ వర్షం.. హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన


### ముషీరాబాద్‌లో అత్యధికంగా 5 సెం.మీ.. నేడు పలు జిల్లాల్లో కుండపోత



ఈ ఏడాది వర్షాకాలం మొదలయ్యాక తొలిసారి ఏపీ, తెలంగాణలో భారీవర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా భారీవర్షం కురుస్తోంది. మంగళవారం అత్యధికంగా ముషీరాబాద్‌లో 5 సెటీమీటర్ల వర్షం నమోదైంది.

హైదరాబాద్, జూలై 28 (ఈవార్తలు): మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. రాజేంద్ర నగర్‌లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా వ్యాపించింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది. భారీవర్షంతో - 2 వ పేజీలో...

## విశ్వవాణి



రక్త క్యాన్సర్ చికిత్స కోసం అభివృద్ధి చేసిన సీఏఆర్-టీ సెల్ థెరపీ ఇప్పుడు ఆటోఇమ్యూన్ వ్యాధుల చికిత్సలోనూ ఆశాజనక ఫలితాలను చూపుతోంది. ప్రస్తుతం ఆటోఇమ్యూన్ వ్యాధులకు ఉపయోగిస్తున్న చికిత్సలు ప్రధానంగా వాపును తగ్గించడంపైనే దృష్టి పెడతాయి. అయితే సీఏఆర్-టీ సెల్ థెరపీ మాత్రం వ్యాధికి కారణవ-ఎవుతున్న హానికర రోగనిరోధక కణాలనే లక్ష్యంగా చేసుకుని వాటిని తొలగిస్తుంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ మళ్లీ ఆరోగ్యకరమైన కణాలతో పునర్నిర్మించుకునే అవకాశం కలుగుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



# సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది

*సింహాచలం గిరిప్రదక్షిణ అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. భారీగా తరలివచ్చిన భక్తులు సింహాద్రి అప్పన్న నామస్మరణతో ముందుకు కదులుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 2 లక్షల మంది గిరి ప్రదక్షిణ పూర్తి చేశారని, రాత్రికి ఆ సంఖ్య 3 లక్షలకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొత్తంగా 10 లక్షల మంది దాకా భక్తులు దర్శించుకుంటారని పేర్కొన్నారు. కాగా, భక్తులతో గిరి ప్రదక్షిణ మార్గాలన్నీ కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్థానికులు అల్పాహారం, తాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల ద్వారా గుర్తించి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గాల్లో 33 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల నిమిత్తం 26 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.*

- 'ఈవార్తలు' ప్రత్యేక ప్రతినిధి, వైజాగ్




# రేవంత్ రెడ్డి.. 'క్రిమినల్'!

### సీఎంలలో అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు

### రాజకీయ నిరసనలు, ర్యాలీల్లో నమోదైనవే

### ప్రస్తుతం విచారణ దశలో అనేక కేసులు

### డీకే, చంద్రబాబు, విజయ్.. బాగా రిచ్

### ఏడీఆర్ నివేదికలో కీలక అంశాలు

దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలు, వయస్సు వంటి వివరాలపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదిక దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా రూపొందించిన ఈ రిపోర్టులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు ప్రకటించిన ముఖ్యమంత్రిగా నిలిచారు.

న్యూఢిల్లీ: ఇక సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో దక్షిణాది రాష్ట్రాల నుంచే తొలి 3 స్థానాల్లో సీఎంలు నిలిచారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తొలి స్థానాన్ని దక్కిం చుకోగా.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండో స్థానంలో నిలిచారు. ఏడీఆర్ రిపోర్టు ప్రకారం దేశంలో ని 28 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల కు చెందిన మొత్తం 31 మంది ముఖ్యమం త్రుల ప్రకటిత ఆస్తుల మొత్తం విలువ రూ. 3,660 కోట్లుగా ఉంది. ఇందులో ఒక్క కర్ణాటక సీఎం డీకే శివకుమార్ రూ.1,413 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా తరువాయి 2 వ పేజీలో...

ఈవార్తలు

బుధవారం 29-7-2026, జగిత్యాల

# రాశి ఫలాలు



29.7.2026

**మేషం:** దూరపు బంధువుల నుండి వివాదాలకు సంబంధించిన కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో జాప్యం ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంతవరకు అనుకూలిస్తుంది. వృత్తి ఉద్యోగ విషయాల్లో అధికారులతో చర్చలు సఫలమౌతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**వృషభం:** ఇతరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. సంతాన ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరమౌతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారమున విలువైన వస్తువుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. దైవ చింతన పెరుగుతుంది.

**మిథునం:** శారీరక మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. మాతృ వర్గ బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన ప్రతి పనిలో అడ్డంకులు తప్పవు. వృత్తి వ్యాపారాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. అన్ని వైపుల నుండి అనుకూలత పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో మీ నిర్ణయాలు అందరికి నచ్చే విధంగా ఉంటాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

**సింహం:** ప్రారంభించిన పనులలో జాప్యం కలుగుతుంది. ధనపరంగా ఇబ్బందులు తప్పవు. ఇంటా బయట దీర్ఘకాలిక సమస్యలు చికాకు పరుస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. దైవ చింతన కలుగుతుంది.

**కన్య:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఇంటాబయటా సమస్యలు ఉన్నప్పటికీ నిదానంగా పరిష్కరించుకుంటారు. వృత్తి వ్యాపారాలలో నష్టాలు అధిగమించి లాభాల పొందుతారు. ఉద్యోగమున అధికారులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్త వహించాలి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

**తుల:** కీలక వ్యవహారాలలో ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. దూర దేశ సంచారం చేయవలసి వస్తుంది. అనుకోని విధంగా ఖర్చులు పెరుగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. వ్యాపారాల్లో స్వల్ప నష్టాలు తప్పవు.

**వృశ్చికం:** ధనాదాయ మార్గాలు పెరుగుతాయి. ఇతరుల సహాయ సహకారాలతో కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. సంతానానికి నూతన విద్యా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. శారీరక మానసిక ప్రశాంతత లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

**ధనస్సు:** చుట్టుపక్కల వారితో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులు ఉన్నత పదవులు పొందుతారు. కొన్ని వ్యవహారాలలో ఆత్మవిశ్వాసంతో స్థిర నిర్ణయాలు చేసి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇంటా బయటా గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

**మకరం:** సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. గృహనిర్మాణ పనులకు శ్రీకారం చుడతారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. సంతాన వివాహ ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. సంతాన ఆరోగ్యం విషయంలో శుభవార్తలు అందుతాయి.

**కుంభం:** అనుకున్న సమయానికి అనుకున్న రీతిలో సౌకర్యాలు లభించక ఇబ్బందిపడతారు. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. ధన విషయంలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది. కొందరి ప్రవర్తన మానసికంగా మరింత చికాకు పరుస్తుంది.

**మీనం:** కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఇంటా బయటా మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. గృహమునకు బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

# కొట్టి కొట్టి.. కాల్చి చంపుతున్నారు!

మొదటి పేజీ తరువాయి

మృతదేహాలు రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పీవోకే ఇన్ఫ్లూయెన్సర్ అఖీల్ భాయ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. మాకు అండగా నిలబడాలని వేడుకున్నాడు. 'మిత్రులారా మా పరిస్థితులు చాలా దయనీయంగా మారాయి... రావల్‌కోట్ మృతదేహాలతో, గాయపడినవారితో నిండిపోయింది.. దేవుడి కోసం, ఈ క్షణంలో మాకు అండగా నిలబడండి.. దయచేసి, మాకు తోడుగా ఉండండి. తృటిలో నేను ప్రాణాలతో బయటపడ్డాను. నా ప్రాణాల గురించి ఇక చింతలేదు.. ఎంతో మంది సోదరులు అమరులైన తర్వాత నేను మీముందుకు వచ్చి చేతులు జోడించి వేడుకుంటున్నాను.. దయచేసి కొంచమైన విచక్షణతో ఆలోచించండి.. ఈ వీడియోను చూస్తున్న అంతర్జాతీయ మీడియాను విజ్ఞప్తి చేసేది ఒకటే.. దయచేసి మాకు మద్దతు ఇవ్వండి. మేము ప్రశాంతమైన ప్రజలం.. లెక్కలేనన్ని మృతదేహాలు, లెక్కలేనంత మంది గాయపడ్డారు. మృతదేహాలను మా భుజాలపై మోసి మోసి అలసిపోయాం' అని ఆవేదన వ్యక్తం చేశాడు.

## వేలాదిగా పాక్ సైన్యం మోహరింపు

పీవోకేలో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చి, ఉద్యమాన్ని నడిపిస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకులను పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుకాగా.. భద్రత కోసం 14 వేల మందికిపైగా సైనికులను పీవోకేలో మోహరించింది. అంతేకాదు, పలు ప్రాంతాల్లో స్నైపర్లను మోహరించగా.. ఆందోళనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు నిజమైన తూటాలు, లాంగ్ రేంజ్ టియర్ గ్యాస్ షెల్స్ ఉపయోగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి. తకొన్నివారాల నుంచి నిరసనలు జరుగుతున్న ఈ ప్రాంతంలో అసమ్మతిని ఉక్కుపాదం



అణచివేయడానికి ఆందోళనకారులపై కాల్పులు జరపాలని భద్రతా దళాలను ఆదేశించారు. పీవోకే ప్రజలపై బలప్రయోగంతో పాటు ఇంటర్నెట్, మొబైల్ సేవలను కూడా ప్రభుత్వం నిలిపివేసింది. ఆ ప్రాంతంలోని అనేక చోట్ల విద్యుత్, నీటి సరఫరాను కూడా నిలిపివేశారు. పీవోకే స్థానిక అసెంబ్లీలోని 53 స్థానాలకు గానూ 45 సీట్లకు ఆగస్టు 10 వరకు మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 8 స్థానాలకు మహిళలు, టెక్నోక్రాట్స్, మతపెద్దలను నామినేట్ చేస్తారు. జులై 27వ తేదీన మిర్పూర్ డివిజన్‌లోని 13 సీట్లకు పోలింగ్ ముగిసింది. ముజఫర్‌బాద్ డివిజన్‌లోని 9తో పాటు శరణార్థులకు కేటాయించిన 12 సీట్లకు ఆగస్టు 2, పూంచ్ డివిజన్‌లోని 11 స్థానాలకు ఆగస్టు 10న పోలింగ్ నిర్వహిస్తారు.

# తప్పంతా కేసీఆర్‌దే

మొదటి పేజీ తరువాయి

సెంటర్లు ఏర్పడుతున్నాయని, అవే ప్రశ్నపత్రాల లీకేజీలకు కేంద్రాలుగా మారుతున్నాయని విమర్శించారు. ఈ సమస్యపై దేశవ్యాప్తంగా ఒక సమగ్ర విధానం రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యా వ్యవస్థపై కేంద్రం అధిక నియంత్రణకు ప్రయత్నించకూడదని, రాష్ట్రాలకే ఎక్కువ అధికారాలు ఉంటే పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం గ్లోబరీనా వంటి సంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల అవి సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి గందరగోళానికి కారణమయ్యాయని ఆరోపించారు. ఇటువంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు తెలంగాణకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 వేల కోట్ల బకాయిలు వదిలి వెళ్లిందని సీఎం పేర్కొన్నారు. సక్రమంగా నడుస్తున్న విద్యాసంస్థలకు బకాయిలు చెల్లిస్తామని, అక్రమాలకు పాల్పడిన సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతోందన్నారు. భవిష్యత్తులో ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించామని, అవసరమైతే ముందుగానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. ప్రతి ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.2,200 కోట్లు–2,400 కోట్లు అవసరమవుతాయని, ఇకపై ఈ పథకంలో బకాయిల సమస్య ఉండదని స్పష్టం చేశారు.

హైడ్రా పనులు కొనసాగుతాయి

చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించినవారు కోర్టులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సీఎం విమర్శించారు. హైడ్రా ప్రభుత్వంలోని అత్యంత కీలక సంస్కరణల్లో ఒకటని పేర్కొంటూ, ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం హైడ్రా చర్యలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎన్ కన్వెన్షన్, గండిపేట చెరువు, బతుకమ్మ కుంట వంటి ఆక్రమణల తొలగింపును ఉదాహరణగా ప్రస్తావిస్తూ, కబ్జాదారులను కాపాడేందుకు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, వాటిని సమీక్షించిన అనంతరం చట్టబద్ధంగా ముందుకు సాగుతామని చెప్పారు. ప్రజల భద్రత, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పారదర్శక పాలన విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు.

# జాన్సన్ బేబీ పౌడర్..
# రూ.52,700 వేల కోట్లు!

మొదటి పేజీ తరువాయి

జాన్సన్ అండ్ జాన్సన్ పోరాడుతోంది. హానికరమైన ఆస్బెస్టాస్ పదార్థం లేదని వాదిస్తూ వస్తోంది. అవి అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయనే ఆరోపణలను ఖండించింది. అయితే, ఈ విషయంలో ఏళ్ల తరబడి కోర్టు విచారణలు, వాటిపై అవుతున్న ఖర్చులకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో తాము గెలుపొందుతామని తమకు నమ్మకం ఉన్నా.. దానిపై ఎక్కువ సమయం కేటాయిస్తుండడంతో కంపెనీ ఇతర లక్ష్యాలపై సరిగ్గా దృష్టి సారించలేకపోతోందని జాన్సన్ అండ్ జాన్సన్ తెలిపింది. అందుకే రూ.52 వేల కోట్లు చెల్లించేందుకు అంగీకరించామని పేర్కొంది. అయితే, తొలి విడతలో 2027లో 3 బిలియన్ డాలర్లు చెల్లిస్తామని, మిగతా డబ్బును 2028లో చెల్లిస్తామని కోర్టుకు తెలిపింది.

## ఆరోపణలు ఏంటీ అంటే..

జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్ సహా ఆ కంపెనీ తయారు చేసే ఇతర ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా మహిళలు అండాశయ క్యాన్సర్ బారిన పడుతున్నట్లు కొన్నేళ్ల క్రితం అమెరికాలోని వివిధ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పౌడర్లలో క్యాన్సర్‌కు కారణమయ్యే ఆస్బెస్టాస్ అనే పదార్థం కలుపుతున్నట్లు పిటిషనర్లు ఆరోపించారు. ఈ వార్తలను జాన్సన్ కంపెనీ ఖండించింది. అయితే, 2020లో అమెరికాలో టాల్క్ ఆధారిత జాన్సన్ బేబీ పౌడర్ అమ్మకాలను ఆపేసి వాటి స్థానంలో మొక్క జొన్న పిండితో తయారు చేసే పౌడర్ తీసుకొచ్చారు.

# రేవంత్ రెడ్డి.. 'క్రిమినల్'!

మొదటి పేజీ తరువాయి

నిలిచారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు రూ.931 కోట్లతో రెండో స్థానంలో.. తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ రూ.648 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూ.30 కోట్లకు పైగా ప్రకటిత ఆస్తులతో 8వ స్థానంలో ఉన్నారు. అతి తక్కువ ఆస్తులు ప్రకటించిన ముఖ్యమంత్రుల జాబితాలో జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షలతో తొలి స్థానంలో ఉండగా.. పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి రూ.85 లక్షలతో రెండో స్థానంలో.. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ సుమారు రూ.1 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నివేదికలో ఎక్కువ చర్చకు దారితీసిన అంశం ముఖ్యమంత్రులపై నమోదైన క్రిమినల్ కేసులే. మొత్తం 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. ఇందులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 89 కేసులతో అగ్రస్థానంలో నిలిచారు. రేవంత్ రెడ్డి తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై 29 కేసులు ఉన్నాయి. కర్ణాటక సీఎం డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుపై చెరో 19 కేసులు నమోదైనట్లు ఈ నివేదిక పేర్కొంది. ఇద్దరు ముఖ్యమంత్రులపై హత్యాయత్నానికి




సంబంధించిన కేసులు కూడా ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం రేవంత్ రెడ్డి ప్రకటించిన 89 కేసుల్లో ఎక్కువగా రాజకీయ నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఎన్నికల ప్రచారాల సమయంలో నమోదైనవేనని వివరాలు సూచిస్తున్నాయి. ఈ కేసుల్లో చాలా వరకు ప్రస్తుతం వివిధ కోర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. కేసులు నమోదై ఉండటం మాత్రమే నేరం రుజువైనట్లు కాదని.. ఇవన్నీ అభ్యర్థులు ఎన్నికల అఫిడవిట్లలో స్వయంగా ప్రకటించిన వివరాలేనని ఏడీఆర్ తెలిపింది. వయస్సు పరంగా చూస్తే 31 మంది ముఖ్యమంత్రుల్లో 17 మంది సీఎంలు.. 51 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఉన్నారని.. మరో 8 మంది 41 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది.


# మహిళలు, పిల్లల భద్రతకు చర్యలేవి?

మొదటి పేజీ తరువాయి

చిన్నారులు, కార్మికులు, రైతులు సహా ప్రజా భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలి. ఆగస్టు 3, 2026 రోజున సాయంత్రం 4 గంటలకు సోషల్ మీడియా కంపెనీల ప్రతినిధులతో సమావేశం ఉంటుంది' అని తెలిపారు. నీట్ యూజీ పేపర్ లీక్ అంశంపై విద్యార్థులు చేపట్టిన నిరసనలను ప్రచారం చేసేందుకు కాక్రోచ్ జనతా పార్టీ విస్తృతంగా సోషల్ మీడియాలను ఉపయోగించింది. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేసిన సెల్ఫీ వీడియోను ఫేస్‌బుక్ డిలీట్ చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడం, ఆగస్టు 3వ తేదీన కీలక సమావేశం నిర్వహిస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలు కఠిన నిబంధనలు అమలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా ఉండే వీడియోలు, గోప్యతకు భంగం కలిగించే అంశాలు, వీడియోలను, పోస్టులను అనుమతించకుండా కేంద్రం ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# నేర చరిత్రలేని సీజేపీలను విడుదల చేయండి

మొదటి పేజీ తరువాయి




పశ్చిమ బెంగాల్, కేరళ సహ దేశవ్యాప్తంగా వ్యాపించాయి. ఈ నిరసనల సందర్భంగా పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేశారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చి, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. నీట్ పేపర్ లీక్ ఆరోపణలపై నిరసన చేస్తున్న విద్యార్థులపై రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19, 20, 21లను ఉల్లంఘిస్తూ పోలీసులు లాఠీచార్జి, పెల్లెట్ గన్లు, టియర్ గ్యాస్, విద్యుత్ ఆయుధాలను ప్రయోగించారని పిటిషన్లలో ఆరోపించారు. ప్రాథమికంగా తమ ముందు ఉంచిన ఆరోపణలపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరపాలని కోర్టు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ, డ్రోన్, బాడీ–కెమెరా, వైర్‌లెస్ కమ్యూనికేషన్, పోలీస్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్) రికార్డులను భద్రపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసనకారుల డిజిటల్ డేటాను భద్రపరచాలని, దానిని బహిరంగంగా విడుదల చేయకూడదని పోలీసులను కోరింది. వారి వ్యక్తిగత డేటా లేదా వివరాలు ఏవీ ప్రచురించకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఆగస్టు 3న జరగనున్న తదుపరి విచారణకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ హాజరు కావాలని కూడా కోర్టు కోరింది.

# తడిసిముద్దైన నేలమ్మ

మొదటి పేజీ తరువాయి

రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నా యి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని ముషీరాబాద్‌లో అత్యధిక వర్ష పాతం నమోదైంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం ఇలా నమోదైంది (మిల్లీమీటర్లలో) : ముషీరాబాద్ 50.0, తార్నాక 49.8, కావడిగూడ 46, జూబ్లీహిల్స్ 41.5, ఉస్మానియా యూనివర్సిటీ 40.3, బోయిన్‌పల్లి 39.8, బోరబండ 39.0, తుర్కయాంజాల్ 37.8, కవాడిగూడ 37, మియాపూర్ 36.5, అమీర్‌పేట్ 35.5, మెట్టుగూడ 35.5, గోల్కొండ 35.3, శేరిలింగంపల్లి 34.8, యూసఫ్‌గూడ 34.8, మూసాపేట 34.5, నాచారం 34.5, కప్ర 34.5, కీసర 34.3, కూకట్‌పల్లి 34, కావడిగూడ 34, అమీన్‌పూర్ 34, శంషాబాద్ 33.8, మూసాపేట (ఈఎస్ఎస్ బాలానగర్) 33.5, సికింద్రాబాద్ 33.5, మారేడ్‌పల్లి 33.3, ముషీరాబాద్ 33.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మాదాపూర్, కేపీహెచ్‌బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పట్టింది. మరోవైపు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా మక్దుంపూర్‌లో అత్యధికంగా 7 సెం.మీ వర్షపాతం నమోదైంది. జుక్కల్ (కామారెడ్డి) 6.5, హీరాపూర్‌లో (ఆదిలాబాద్) 6 సెం.మీ, తాంసీ (ఆదిలాబాద్) 5.8, ముషీరాబాద్‌లో (హైదరాబాద్) 5 సెం.మీ, హన్మాపూర్ (యాదాద్రి) 4.2, మోమిన్‌పేటలో, (వికారాబాద్) 4 సెం.మీ, కొమ్ములవంచ (మహబూబాబాద్) 4, చెన్నారావుపేటలో (వరంగల్) 3.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా, బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో బుధవారం ఏపీ, తెలంగాణలో ఈదురుగాలులతో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు భారత వాతావరణ శాఖ మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్ష సూచన జారీ చేసింది. తాజా వాతావరణ బులెటిన్ ప్రకారం.. అర్ధరాత్రి నుంచి రేపు ఉదయం వరకు ఉత్తర తెలంగాణ, దాని పరిసర జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉండనుందని పేర్కొంది. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, రంగారెడ్డి మరియు వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా కుండపోతగా అంటే 10 సెంటీమీటర్లకు పైగా అతి భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. వాతావరణ పరిస్థితుల తీవ్రతను బట్టి రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లుండి ఉదయం వరకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లను జారీ చేశారు. రాత్రి సమయంలో వర్షం పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.





## ‘కిడ్స్ కాన్వెంట్’లో ఘనంగా బోనాల సంబురాలు

వేములవాడ అర్బన్, జూలై 28 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు వారిలో దైవభక్తి, సాంస్కృతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అన్ని తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణ సంప్రదాయ బోనాల పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, డైరెక్టర్ ఫసివుల్లా, ప్రిన్సిపాల్ దరక్షణ్ వస్ఫియా మాట్లాడుతూ, బోనాల పండుగ భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక బాధ్యత, విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది, సహకరించిన తల్లిదండ్రులు, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలు పాఠశాలలో భక్తి, సంస్కృతి, ఆనందోత్సాహాల నడుమ వైభవంగా జరిగాయి.

## 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

**శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రేవంత్ రెడ్డి**

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ‘ప్రధాని ఆవాస్ యోజన – గ్రామీణ్’ 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

## అమెరికాలో తెలంగాణ మహిళ మృతి

న్యూజెర్సీ: అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీపతి దీపారెడ్డి (44) దుర్మరణం చెందారు. ఆమె రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందినవారు. దీపారెడ్డి తన భర్త రామకృష్ణారెడ్డితో కలిసి న్యూజెర్సీలో నివాసముంటున్నారు. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో, వేగంగా వచ్చిన మరొక వాహనం వీరి కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపారెడ్డి ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సంతోషంగా జీవిస్తున్న కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలముకోవడంతో స్వగ్రామం ఆకుతోటపల్లిలోనూ, బంధువుల్లోనూ విషాదం నెలకొంది. ఈ ప్రమాదంపై న్యూజెర్సీ స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దీపారెడ్డి భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారే

**టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు**

హైదరాబాద్, జూలై 28 (ఈవార్తలు): తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో ‘డబుల్ ఇంజిన్ ప్రభుత్వం’ ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## టీవీ ఆర్టిస్టుల అవార్డులకు పీవీ పేరు

**మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన**

హైదరాబాద్, జూలై 28 (ఈవార్తలు): బుల్లితెర (టెలివిజన్) రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తొలిసారిగా టెలివిజన్ రంగానికి రాష్ట్ర స్థాయి అవార్డులను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలో టెలివిజన్ అవార్డు కమిటీతో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశమై అవార్డుల రూపకల్పనపై కీలక చర్చలు జరిపారు. అవార్డుల లోగో, పేరు, కేటగిరీలు, ఎంపిక విధానం వంటి అంశాలపై కమిటీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి.. అవార్డుల పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా ఉండాలని హితవు పలికారు. మాజీ ప్రధానమంత్రి, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు పేరును ఈ టీవీ అవార్డులకు పెట్టాలని కమిటీ సభ్యులు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ టీవీ అవార్డుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కోట్లాది మంది ప్రేక్షకులకు వినోదంతో పాటు సామాజిక సందేశాలను కూడా టెలివిజన్ రంగం అందిస్తోందని పేర్కొన్నారు.

# నేను పార్టీ లైన్ దాటలేదు

**దుష్టశక్తుల వల్లే వివాదం.. టీడీపీ కమిటీ ముందు బోండా ఉమ వివరణ**



విజయవాడ, జూలై 28 (ఈవార్తలు): గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ కార్యక్రమంలో వైసీపీ నేత అంబటి రాంబాబుతో సమావేశం కావడంపై చెలరేగిన వివాదంపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు వివరణ ఇచ్చారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ముందు మంగళవారం ఆయన హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులతో కూడిన కమిటీకి తన వాదనను సమగ్రంగా వినిపించారు. తాను పార్టీ లైన్‌ను ఎప్పుడూ దాటలేదని, చంద్రబాబు ఆదేశాలను ధిక్కరించే ప్రసక్తే లేదని, చంద్రబాబు ఆదేశాలే తనకు శిరోధార్యమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలోని కొన్ని దుష్ట శక్తులు కావాలనే తన మాటలను, అక్కడ జరిగిన సంఘటనను వక్రీకరించి దుష్ప్రచారం చేశాయని ఆయన ఆరోపించారు. ఈ నెల 25వ తేదీన గుంటూరులో దివంగత నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగిందని, ఆ కార్యక్రమానికి కాపు జేఏసీ ఆహ్వానం మేరకు తాను వెళ్లానని బోండా ఉమా తెలిపారు. “అది పూర్తిగా రాజకీయాలకు అతీతమైన సంస్మరణ సభ. నేను ఉదయం 11 గంటలకు వెళ్లి, అక్కడ నివాళులు అర్పించి గంటలోపే, అంటే 12 గంటలకు తిరిగి వచ్చేశాను. నేను కూర్చున్న చోటుకే వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఆయన పలకరిస్తే నేను మాట్లాడాను. ఇది రహస్యంగానో, చాటుమాటుగానో జరిగింది కాదు. మీడియా అంతా అక్కడే ఉంది. బహిరంగ వేదికపైనే ఈ సంభాషణ జరిగింది. ఆ సభకు జనసేన, బీజేపీ, టీడీపీ, వైసీపీ సహా అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు” అని ఉమా వివరించారు. ఒక చిన్న విషయాన్ని పట్టుకుని, దానిని వక్రీకరించి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారని బోండా ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. “ఈ వివాదం వెనుక కొన్ని దుష్ట శక్తులు ఉన్నాయి. పార్టీలో గ్యాప్ తేవాలనుకునే వారు ఇలాంటి ప్రచారాలు చేస్తుంటారు. నేను అనని మాటలను కూడా అన్నట్లుగా కొన్ని టీవీ ఛానెళ్లలో ప్రసారం చేశారు. నేను ఆరోజు ఉదయం 12 గంటలకు గుంటూరు నుంచి వచ్చేస్తే, ఆ తర్వాత రోజంతా నా పేరుతో స్టేట్‌మెంట్లు ఎలా వచ్చాయి? ఇదంతా నాపై, పార్టీపై జరుగుతున్న కుట్రలో భాగమే” అని ఆయన ఆరోపించారు. తాను 25 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నానని, ఏనాడూ పార్టీ గీత దాటలేదని బోండా ఉమా ఉద్ఘాటించారు. “2019 నుంచి 2024 మధ్య కాలంలో ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశాం. మాచర్ల, గుడివాడ ఘటనలైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినా పార్టీని కాపాడుకోవడానికి ముందున్నాం. చంద్రబాబు ఆదేశాలను, ఆయన ఉద్దేశాలను ధిక్కరించే ఆలోచన నాకు కలలో కూడా రాదు, రాబోదు. ఈ విషయంపైనే కమిటీకి సమగ్రంగా వివరించాను” అని ఆయన తెలిపారు. జరిగిన సంఘటన వల్ల పార్టీకి ఏదైనా నష్టం వాటిల్లిందా అనే కోణంలో అధిష్ఠానం వివరణ కోరిందని, వాస్తవాలను వారికి తెలియజేశానని చెప్పారు. ఇది కేవలం సమన్వయ లోపం వల్లే జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటానని కమిటీకి హామీ ఇచ్చినట్లు బోండా ఉమా స్పష్టం చేశారు. దీంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.

# సీడ్ మేళా ద్వారా విత్తనాల పంపిణీ




హైదరాబాద్, జూలై 28 (ఈవార్తలు): ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో సరిగ్గా వర్షాలు కురవటం లేదు. ఈ నేపథ్యంలో అన్నదాతలను రక్షించేందుకు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సీడ్ మేళాలు నిర్వహిస్తోంది. సోమవారం ప్రారంభమైన ఈ ప్రత్యేక విత్తన మేళా ఈనెల 29 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోని 32 జిల్లాల పరిధిలోని మొత్తం 2,604 రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. రైతుల సౌకర్యార్థం ప్రతి రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్లలో కందులు, పెసలు, మినుములు, మక్కజొన్న, జొన్న, కూరగాయలతో పాటు వివిధ ఆరుతడి పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారులు వెల్లడించారు. కేవలం విత్తనాల పంపిణీయే కాకుండా.. విత్తన మేళాలో పాల్గొంటున్న వివిధ పరిశోధనా సంస్థల నిపుణులు, శాస్త్రవేత్తలు రైతులకు మార్గదర్శనం చేస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల నిపుణులు స్థానికంగా అందుబాటులో ఉండి పంటల ఎంపిక, సాగు పద్ధతులపై సలహాలు ఇస్తున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా.. పరిస్థితులకు తగినట్లుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర అగ్రికల్చర్ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్ సూచించారు. పాడి రైతులు పశుగ్రాసం కొరత రాకుండా మేత జొన్నను సాగు చేసుకోవాలని, నగర శివారు ప్రాంతాల రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కోరారు. తద్వారా తక్కువ కాలంలోనే మెరుగైన ఆదాయం పొందవచ్చునని అన్నారు. స్థానిక భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా ఏఏ పంటలు సాగు చేయాలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎంపిక చేసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి, శాస్త్రీయ సాగు విధానాలు అవలంబించడం ద్వారా పెట్టుబడి నష్టాలను పూర్తిగా నివారించవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

# పోలీసులు అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూలై 28 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొన్ని రోజులుగా ఆయన కోసం గాలింపు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. ఈ పరిణామంతో ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. బాధిత మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై కొన్ని రోజుల క్రితం కేసు నమోదైంది. ఆ తర్వాత కేసు దర్యాప్తును హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ మహిళల భద్రత విభాగం (ఉమెన్స్ సేఫ్టీ వింగ్)కు బదిలీ చేశారు. ఫిర్యాదు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్ నమోదు చేసేందుకు పోలీసులు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు. శిక్షణ సమయంలో ఇచ్చిన చిరునామాల్లో కూడా ఆయన కనిపించకపోవడంతో ప్రత్యేక బృందాలు గాలింపు ప్రారంభించాయి. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేశారనే ప్రచారం జరగడం పెను సంచలనం రేపింది. అయితే చికిత్స అందించిన డాక్టర్లు మాత్రం ఆయన శరీరంలో విషపదార్థాల ఆనవాళ్లు లేవని.. అధిక మద్యం సేవించడం వల్లే అపస్మారక స్థితికి చేరుకున్నారని వెల్లడించారు. ఇదే సమయంలో సోషల్ మీడియాలో వైరల్ అయిన సూసైడ్ లెటర్ మద్యం మత్తులో రాసి ఉండొచ్చని చెప్పడంతో ఆ వివాదానికి తెరపడింది. అయితే.. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు ఇటీవల వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలోనే తాను పరారీలో లేనని.. నానమ్మ ఆరోగ్యం బాగోలేక స్వగ్రామానికి వెళ్లానని ఉదయ్ కృష్ణారెడ్డి వెల్లడించారు. తనపై వచ్చిన ఆరోపణలను చట్టపరంగా ఎదుర్కొంటానని.. న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. ఇదే సమయంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణకు ముందు ఉదయ్ కృష్ణా రెడ్డి అరెస్టు కావడం ఈ కేసులో మరో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్‌ను పోలీసులు నమోదు చేసి.. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను వేగవంతం చేయనున్నారు.

## పెద్ది మెదడుకు అందని ఆక్సిజన్

**అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్‌లో చికిత్స**

సికింద్రాబాద్, జూలై 28 (ఈవార్తలు): బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెల్త్ బులిటెన్‌ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి డాక్టర్లు విడుదల చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఇప్పటికీ ఇంకా విషమంగానే ఉందని వెల్లడించారు. ఆయనకు అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో.. ప్రత్యేక డాక్టర్ల నిపుణుల బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని ఆ హెల్త్ బులెటిన్‌లో తెలిపారు. యశోద డాక్టర్లు వెల్లడించిన వివరాల ప్రకారం.. పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా రక్తప్రసరణ వ్యవస్థ ఒక్కసారిగా దెబ్బతిందని.. దీంతో ఆయన షాక్‌కు గురికావడంతో గుండెపోటు వచ్చిందని తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు వచ్చిన తర్వాత మొదట వరంగల్‌లోని రోహిణి ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందించి.. సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ నిర్వహించి గుండె స్పందనను పునరుద్ధరించారని డాక్టర్లు తెలిపారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్‌రెడ్డికి మెకానికల్ వెంటిలేటర్ సాయంతో చికిత్స కొనసాగుతోందని యశోద ఆస్పత్రి డాక్టర్లు స్పష్టం చేశారు. తక్కువ మోతాదులో మందులతో బీపీ, ఇతర కీలక అవయవాల పనితీరు నిలకడగా ఉన్నప్పటికీ, ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి మాటలకు గానీ, నొప్పి ఉద్దీపనలకు గానీ ఎలాంటి అర్థవంతమైన న్యూరాలజికల్ స్పందన కనిపించలేదని డాక్టర్లు వెల్లడించారు. ఈఈజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల న్యూరాలజికల్ నష్టం జరిగినట్లు సూచించే లక్షణాలు గుర్తించినట్లు హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ వైద్య మార్గదర్శకాల ప్రకారం.. 72 గంటల తర్వాత మరోసారి న్యూరాలజికల్ రీ అసెస్‌మెంట్ నిర్వహించి.. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై మరింత స్పష్టత ఇస్తామని యశోద వైద్యులు తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాలకు చెందిన నిపుణుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని.. చికిత్సకు సంబంధించిన ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు యశోద ఆస్పత్రి యాజమాన్యం వెల్లడించింది. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ సహచరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, బీఆర్ఎస్ కీలక నేతలు కూడా ఆస్పత్రికి వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మంత్రి సీతక్క, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వంటి నేతలు పార్టీలకు అతీతంగా వచ్చి పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శిస్తున్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## మూడ్నెల్లు చాలా డేంజర్

**ఏపీలోని పలు జిల్లాల్లో తీవ్ర వర్షాభావం**

**అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు**

అమరావతి,జూలై 28 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు తక్కువగా కురుస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లోనూ తక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. వచ్చే మూడు నెలలు కూడా లోటు వర్షపాతం నమోదు కావొచ్చన్న వాతావరణ శాఖ అంచనాల నడుమ.. ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎల్‌నినో కారణంగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు, వాటి ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు వివరాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. జూన్ నెల నుంచి నవంబర్ నెల మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 551 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఒక్క జూలై నెలలోనే 69 శాతం మేరకు లోటు వర్షపాతం నమోదైందని.. రాబోయే మూడు నెలలలో సరాసరి 35 శాతం నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేశారు. ఎల్‌నినో కారణంగా వైఎస్సార్ కడప, అన్నమయ్య, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో వర్షాభావ పరిస్థితి నెలకొందని తెలిపారు. 1.07 లక్షల హెక్టార్లలో వరి, 2.78 లక్షల హెక్టార్లలో పత్తి సాగుపై ఎల్‌నినో ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 122 హై రిస్క్ మండలాలను గుర్తించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ నేపథ్యంలో హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. అలాగే ఆగస్ట్ మూడో తేదీ నుంచి రాష్ట్రంలోని రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మరోవైపు జూలై 31వ తేదీ వరకూ రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం నమోదు ప్రక్రియ కొనసాగించనున్నట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడుతో పాటుగా.. వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముద్రగడ నా బంధువు

రాజకీయాల కోసం వెళ్లలేదు: జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 28 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ వేస్తున్న రాజకీయ ట్రాప్‌లలో తమ కూటమికి చెందిన కొందరు నేతలు అనవసరంగా పడిపోతున్నారని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హెచ్చరించారు. తాటీపాకలో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు హాజరుకావడంపై వస్తున్న విమర్శలకు జ్యోతుల నెహ్రూ గట్టి కౌంటర్ ఇచ్చారు. “ముద్రగడ నాకు వరుసకు బంధువు, పైగా మా నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత. ఆ వ్యక్తిగత అనుబంధంతోనే నేను అక్కడికి వెళ్లాను తప్ప, ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయడానికో లేదా రాజకీయం చేయడానికో కాదు. దీనిపై జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు” అని స్పష్టం చేశారు. అలాగే, 2019లో టీడీపీ ఓటమికి కాపు ఉద్యమమే కారణమంటూ తమ పార్టీ సీనియర్ నేత బొండా ఉమా చేసిన వ్యాఖ్యలను నెహ్రూ తీవ్రంగా తప్పుబట్టారు. “ఒక్క ఘటనను మాత్రమే పట్టుకుని ఒక పెద్ద సామాజిక వర్గానికి, పార్టీ ఓటమికి ముడిపెట్టడం సరికాదు. కాపులు ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రభుత్వాలకే అండగా నిలుస్తారు.

# రాజన్న గుడి అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## రైతుల ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి.. బీజేపీ సిరిసిల్ల అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

వేములవాడ అర్బన్, జూలై 28 (ఈవార్తలు): గత యాసంగి సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. వేములవాడ రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత యాసంగి సీజన్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు నెలలు గడుస్తున్నా బకాయిలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల కష్టార్జిత సొమ్మును ఆలస్యం చేయకుండా వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ఎంతమంది రైతులు నష్టపోయారు, ఎంత మొత్తం దుర్వినియోగమైంది, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మర్రిపల్లి, మల్లారం, నూకలమర్రి గ్రామాల రైతులు బకాయిల కోసం ఆందోళనలు చేస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. శ్రావణమాసంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చే నేపథ్యంలో తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, క్యూలైన్లు, వైద్య సేవలు తదితర అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం, దేవాదాయ శాఖ సమర్థంగా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాజన్న ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, కేటాయించిన



నిధులు, వాటి వినియోగం, ఖర్చులపై పూర్తి వివరాలతో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పరిపాలనలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సురేందర్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, హనుమాజీపేట సర్పంచ్ జింక మధు, ఎదురుగట్ల సర్పంచ్ కదారి సంధ్య, బొల్లారం సర్పంచ్ సౌజన్య మల్లికార్జున్, ఫాదర్‌నగర్ ఉపసర్పంచ్ పోగుల రాకేష్, మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, మండల పదాధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 600 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయాలి

**ప్రభుత్వానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బహిరంగ లేఖ**

జగిత్యాల, జూలై 28 (ఈవార్తలు): ఖాళీగా ఉన్న 600 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టీ. జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ అమలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పనపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టకపోవడం వల్ల నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉందని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలును వేగవంతం చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, అలాగే జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు అవసరమైన 600 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వ సేవలు మరింత సమర్థంగా అందించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు.

## జగిత్యాలలో గంజాయి గ్యాంగ్ అరెస్టు

**నలుగురు యువకుల పట్టివేత.. 120 గ్రాముల గంజాయి స్వాధీనం**

జగిత్యాల టౌన్, జూలై 28 (ఈవార్తలు): ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి జగిత్యాలలో విక్రయిస్తున్న నలుగురు యువకులను జగిత్యాల టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 120 గ్రాముల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టౌన్ సీఐ పి. కరుణాకర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో టౌన్ ఎస్ఐ ఎం. సుప్రియ ఆధ్వర్యంలో మంగళవారం మోతె రోడ్డు స్మశానవాటిక ఎదురుగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లింగంపేటకు చెందిన జవ్వాజి తేజ, హౌసింగ్ బోర్డుకు చెందిన గజ్జల అజయ్, లక్ష్మీపూర్‌కు చెందిన ఆలకుంట్ల గణేష్, తులసీనగర్‌కు చెందిన ఎల్ల మనోజ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. గంజాయి విక్రయాలు, సరఫరాపై సమాచారం ఉన్నవారు వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

## మున్సిపల్ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ

హైదరాబాద్/జగిత్యాల, జూలై 28 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ ప్రజాప్రతినిధులకు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన ఒకరోజు కెపాసిటీ బిల్డింగ్ అండ్ ట్రైనింగ్ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలన, పట్టణాభివృద్ధి, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, స్థానిక సంస్థల పరిపాలన, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, మున్సిపల్ సేవల మెరుగుదల, పట్టణ ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ద్వారా ప్రజాప్రతినిధుల సామర్థ్యాలు మరింత పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తెలిపారు. శిక్షణలో పొందిన అవగాహనను జగిత్యాల పట్టణ అభివృద్ధికి వినియోగించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులతో పాటు మున్సిపల్ మేనేజర్ గణేష్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: ఏబీవీపీ

జగిత్యాల టౌన్, జూలై 28 (ఈవార్తలు): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో జగిత్యాల తాసిల్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్యాల రాకేష్, నగర కార్యదర్శి రాపాక నిఖిల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. వాటిని విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలకు కూడా దూరమవుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యకర్తలు కౌశిక్, హర్షవర్ధన్, అఖిలేష్, రిత్విక్, కీర్తన, అక్షయ, సృజన తదితరులు పాల్గొన్నారు.



# జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం: బండి రమేష్

కూకట్‌పల్లి, జూలై 28 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేష కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి ఏ–బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ వెంకటేశ్వర్ నగర్‌లో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో తనదైన శైలిలో బలంగా గళం విప్పిన నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. అపారమైన రాజకీయ అనుభవం, విశ్లేషణాత్మక దృష్టి, ప్రజాస్వామ్య



విలువల పట్ల నిబద్ధతతో ఆయన దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. రాజకీయ చతురత, పరిపాలనా అనుభవంతో క్లిష్ట పరిస్థితుల్లోనూ సమర్థవంతమైన పరిష్కార మార్గాలను చూపిన నాయకుడిగా జైపాల్ రెడ్డి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో బలంగా వినిపించడంలో, రాష్ట్ర ఏర్పాటు కోసం అనుకూల వాతావరణం కల్పించడంలో ఆయన పాత్ర కీలకమైందని గుర్తు చేశారు. జైపాల్ రెడ్డి ప్రజాసేవ, రాజకీయ విలువలు, నైతికత నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో ప్రజా ప్రతినిధులు నడవాల్సిన అవసరం ఉందని బండి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, తూము సంతోష్, పులి శివగౌడ్, చంద్ర, నాగార్జున, క్రాంతి, నర్సింగ్, రాము, రమణ, జ్యోతి, శ్రీనివాస్, పార్వతి, ముస్తఫా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జైపాల్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## జగిత్యాలలో వైద్యసేవల బలోపేతానికి వినతులు

**మంత్రి దామోదరతో**

**సంజయ్ కల్వకుంట్ల చర్చ**

హైదరాబాద్, జూలై 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సేవలను బలోపేతం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రస్థాయి వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులను బదిలీ చేయకుండా కొనసాగించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆసుపత్రులకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు, అంబులెన్స్, సిబ్బంది మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, కోరుట్ల మండలం మాధాపూర్‌లో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ వైద్య రంగ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

**జగిత్యాల వైద్య వ్యవస్థపై సమీక్ష**

జగిత్యాల జిల్లా వైద్య వ్యవస్థ అభివృద్ధిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొని జిల్లాలోని వైద్య రంగ సమస్యలు, అభివృద్ధి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జగిత్యాల మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ కోర్సుల పురోగతిపై చర్చించారు. రూ.235 కోట్లతో నిర్మిస్తున్న 450 పడకల ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని, మెడికల్ కాలేజీ, హాస్టల్ పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని, అవసరమైన చోట కొత్త అంబులెన్స్, విద్యార్థుల కోసం బస్సు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. జగిత్యాల పాత బస్టాండ్ ఆసుపత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. జగిత్యాల, రాయికల్ వైద్య ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, నూకపల్లి అర్బన్ కాలనీలో బస్తీ దవాఖాన ఏర్పాటు అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, మెడికల్ కాలేజీ, జిల్లా వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



## మల్యాలలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

మల్యాల, జూలై 28 (ఈవార్తలు): ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ మల్యాల పోలీసులు మంగళవారం మండల కేంద్రంలో డ్రంక్ డ్రైవ్‌తో పాటు ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని బ్రెత్ అనలైజర్ ద్వారా పరీక్షించారు. ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. అలాగే హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ధరించడం, నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఉన్నాయా అనే అంశాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్. సందీప్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని సూచించారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగుతాయని ఎస్ఐ స్పష్టం చేశారు.



## వేములవాడలో రూ.2.65 కోట్లతో సెంట్రల్ లైటింగ్

వేములవాడ అర్బన్, జూలై 28 (ఈవార్తలు): వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.2.65 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. మొదటి, రెండో బైపాస్ రోడ్లలో ఏర్పాటు చేసిన ఈ లైటింగ్ వ్యవస్థను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధిలో భాగంగా మొదటి, రెండో బైపాస్ రోడ్లలోని ప్రధాన ప్రాంతాల్లో 150 విద్యుత్ స్తంభాలు, 300 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా మరో 82 విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు కోరామని, అవి కూడా త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సెంట్రల్ లైటింగ్ వ్యవస్థతో రాత్రి వేళల్లో భక్తులు, ప్రయాణికులకు మెరుగైన భద్రత కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని అన్నారు. ఆధునిక విద్యుత్ వెలుగులతో వేములవాడ పట్టణం మరింత ఆకర్షణీయంగా మారి, యాత్రికులకు సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, భవిష్యత్తులో కూడా మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.



## సాగునీటి కోసం రైతుల ధర్నా

**మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అరెస్ట్**

గంగాధర, జూలై 28 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర ఎక్స్‌రోడ్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఎల్లంపల్లి––కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా స్థానిక చెరువులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు "నీరు ఉంటేనే పంట.. పంట ఉంటేనే ప్రాణం" అంటూ నినాదాలు చేశారు. ధర్నా కారణంగా గంగాధర ఎక్స్‌రోడ్‌పై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సుంకే రవిశంకర్ మాట్లాడుతూ, రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు.

## స్కూల్ బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**విద్యార్థులకు స్వల్ప గాయాలు.. డ్రైవర్‌పై కేసు నమోదు**

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

జగిత్యాల టౌన్, జూలై 28 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో స్కూల్ బస్సును ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై చర్యలు చేపట్టినట్లు జగిత్యాల పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. తిప్పన్నపేట గ్రామానికి చెందిన చక్రాల సుదర్శన్ తక్షశిల హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం విద్యార్థులను స్కూల్ బస్సులో ఎక్కించుకుని జగిత్యాల పట్టణంలోని పికప్ పాయింట్ వద్ద నుంచి కృష్ణనగర్‌లోని పాఠశాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదే సమయంలో పాత బస్టాండ్ నుంచి న్యూ బస్టాండ్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (నంబర్ టీఎస్ 21 టీ 2888) డ్రైవర్ మారంపల్లి నరేష్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి స్కూల్ బస్సును ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న కొంతమంది విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మారంపల్లి నరేష్, తండ్రి జనార్ధన్, రాయికల్ మండలం, జగిత్యాల జిల్లా నివాసిపై జగిత్యాల టౌన్ ఎస్ఐ ఎం. సుప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయాన్ని జగిత్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ వెల్లడించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులను తరలించే వాహనాల సమీపంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## గోదావరి పుష్కరాలపై ఏఎస్పీ చేతన్ సమీక్ష

ధర్మపురి, జూలై 28 (ఈవార్తలు): ధర్మపురి మండలంలోని గోదావరి తీర ప్రాంతాన్ని జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మంగళవారం పరిశీలించారు. రాబోయే పుష్కరాల నేపథ్యంలో పుష్కర ఘాట్ల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల రద్దీని అంచనా వేస్తూ ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకల దారి మళ్లింపు, భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అదనపు ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ నర్సింహారెడ్డి, వెల్గటూర్, ధర్మపురి ఎస్ఐలు ఉదయ్ కుమార్, రవీందర్ తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో అధికారాలు శాశ్వతం కావు.. చట్టమే శాశ్వతం. రాజ్యాంగం ఇచ్చిన అధికారాలు ఎంత విస్తృతమైనవైనా, ప్రజా ప్రయోజనం ఎంత గొప్పదైనా, అవి న్యాయస్థానాల ఆదేశాల పరిధిలోనే వినియోగించాల్సి ఉంటుంది. తెలంగాణ హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను పదవి నుంచి తప్పించాలని తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించడం కేవలం ఒక అధికారిపై వచ్చిన వ్యాఖ్య కాదు.

రాజ్యాంగబద్ధ పాలనలో "రూల్ ఆఫ్ లా" ఎంత శక్తివంతమైనదో మరోసారి స్పష్టం చేసిన పరిణామం. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, పార్కులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, కొండలు వేగంగా ఆక్రమణలకు గురవుతున్నాయనే విమర్శలు పెరిగాయి.

ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు, ప్రభావశీలుల ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ ఒత్తిళ్లు తీవ్రస్థాయికి చేరడంతో ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థగా హైడ్రాను ఏర్పాటు చేసింది. ప్రధాన లక్ష్యం.. ప్రభుత్వ భూములను రక్షించడం, చెరువులను పునరుద్ధరించడం, ఆక్రమణలను తొలగించడం, పట్టణ పర్యావరణాన్ని సంరక్షించడం. హైడ్రా ఏర్పడిన తర్వాత అనేక చెరువుల ఆక్రమణలు తొలగించబడ్డాయి.

ప్రభుత్వ లెక్కల ప్రకారం వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా చర్యలకు ప్రజల్లో ఒక వర్గం నుంచి విశేష మద్దతు లభించింది. మరోవైపు, ఆ చర్యలు న్యాయస్థానాల్లో సవాళ్లను కూడా ఎదుర్కొన్నాయి.




# అధికారం కాదు..

# చట్టమే శాశ్వతం

(శ్రీశైలం దూడం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

లోతుకుంట భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు స్టేటస్ కో అమల్లో ఉండగానే అధికారులు వ్యవహరించిన తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటికే రంగనాథ్‌పై అనేక కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదయ్యాయని గుర్తుచేస్తూ, ఒకే అధికారిపై ఇన్ని కోర్టు ధిక్కరణ కేసులు రావడం అసాధారణమని వ్యాఖ్యానించింది. "రూల్ ఆఫ్ లా"ను కాపాడాల్సిన అధికారులే కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ప్రజాస్వామ్యానికి అది శుభసూచకం కాదని స్పష్టం చేసింది. భారతదేశంలో కోర్టు ధిక్కరణ చట్టం, 1971 అమల్లో ఉంది. ఈ చట్టం ప్రకారం కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, న్యాయపరమైన ప్రక్రియకు ఆటంకం కలిగించడం లేదా న్యాయస్థానం ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలు కోర్టు ధిక్కరణ పరిధిలోకి వస్తాయి. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా వ్యవహరిస్తే, అది వ్యక్తిగత బాధ్యతగా కూడా పరిగణించబడే అవకాశం ఉంటుంది. కోర్టు ధిక్కరణ కేసుల్లో కోర్టులకు హెచ్చరికలు, జరిమానాలు, అవసరమైతే శిక్ష విధించే అధికారం కూడా ఉంది. అందుకే ప్రభుత్వ యంత్రాంగం న్యాయస్థానాల ఆదేశాల అమలులో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది.

హైకోర్టు ఆదేశాల అనంతరం స్పందించిన ఏ.వి. రంగనాథ్ తన చర్యలన్నీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు), ఆర్టికల్ 48ఏ (పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర విధి) స్ఫూర్తితోనే చేపట్టినవని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడామని, చెరువులను పునరుద్ధరించామని, భూ మాఫియా తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. తనపై ఉన్న కోర్టు ధిక్కరణ కేసులన్నింటినీ చట్టబద్ధంగా ఎదుర్కొంటానని ప్రకటించారు.

దేశంలోని పలు రాష్ట్రాలు కూడా ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాయి. ఢిల్లీలో యమునా నది పరివాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు, ముంబైలో మంగ్రూవ్ ప్రాంతాల రక్షణ, బెంగళూరులో రాజకాలువలు, చెరువుల ఆక్రమణల తొలగింపు, చెన్నైలో వరదల తర్వాత జలమార్గాల పునరుద్ధరణ వంటి చర్యల్లో ప్రభుత్వాలు కోర్టుల పర్యవేక్షణలోనే ముందుకు సాగాయి. అనేక సందర్భాల్లో న్యాయస్థానాలు పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా, అదే సమయంలో చట్టపరమైన ప్రక్రియను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశాయి. అంటే ప్రజా ప్రయోజనం ఎంత గొప్పదైనా, చట్ట ప్రక్రియను విస్మరించే అధికారం ఎవరికీ లేదనే సూత్రాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ కోర్టులు పునరుద్ఘాటించాయి. రాజ్యాంగ నిపుణులు, మాజీ న్యాయమూర్తులు తరచూ ఒకే విషయాన్ని చెబుతుంటారు. "ప్రజా ప్రయోజనం" అనేది చట్టానికి ప్రత్యామ్నాయం కాదు. ప్రభుత్వం అక్రమ ఆక్రమణలను అరికట్టాలి, కానీ ప్రతి చర్యకు చట్టబద్ధ ఆధారాలు, నోటీసులు, వినతుల పరిశీలన, న్యాయస్థానాల ఆదేశాలకు గౌరవం తప్పనిసరి. అదే సమయంలో కోర్టు ఉత్తర్వులను అడ్డంగా పెట్టుకుని ప్రజా ఆస్తులను శాశ్వతంగా ఆక్రమించుకునే ప్రయత్నాలను కూడా న్యాయవ్యవస్థ సహించదని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## వ్యక్తుల కంటే గొప్పది వ్యవస్థ

ఈ ఘటనలో ఎవరైనా గెలిచారని, ఎవరైనా ఓడిపోయారని భావించడం సరైంది కాదు. న్యాయవ్యవస్థ తన రాజ్యాంగబద్ధ బాధ్యతను నిర్వర్తించింది. హైడ్రా ప్రభుత్వ ఆస్తుల రక్షణ బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు చెబుతోంది. ఈ రెండు వ్యవస్థల మధ్య రాజ్యాంగ పరిమితులు పాటించబడినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రభుత్వ భూములను కాపాడాలి. భూ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి. చెరువులను రక్షించాలి. కానీ ప్రతి అడుగు న్యాయస్థానాల ఆదేశాలకు లోబడి ఉండాలి. అదే రాజ్యాంగం చెప్పే మార్గం. అదే సుపరిపాలనకు పునాది. అదే ప్రజాస్వామ్యానికి అసలైన బలం. హైడ్రా వంటి సంస్థల అవసరంపై సందేహం లేదు. అయితే వాటి విజయాన్ని నిర్ణయించేది కేవలం కూల్చివేతల సంఖ్య కాదు; చట్టబద్ధత, పారదర్శకత, న్యాయస్థానాల పట్ల గౌరవం కూడా అంతే ముఖ్యం. అధికారుల నిజాయితీకి చట్టం తోడైతేనే ప్రజా విశ్వాసం పెరుగుతుంది. అధికార దూకుడుకు రాజ్యాంగ కట్టడి జతకలిసినప్పుడే సుపరిపాలన సార్థకం అవుతుంది.

యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః।
స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥
సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన వారు ధర్మం, చట్టం, న్యాయాన్ని అనుసరించినప్పుడే ప్రజలు కూడా అదే మార్గంలో నడుస్తారు. అధికారానికి అలంకారం శక్తి కాదు.. ధర్మబద్ధత.

# అభిజీత్ దీప్కేకు పెళ్లి సంబంధాలు క్యూ

ముంబై: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థుల పక్షాన నిలిచి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసిన పరిస్థితుల్లో కీలక పాత్ర పోషించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబ సభ్యులు ఇటీవల మీడియాతో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒకవైపు తమ 30 ఏళ్ల కుమారుడికి పెళ్లి సంబంధాలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు నిరసనల సమయంలో తాము తీవ్రమైన బెదిరింపులను ఎదుర్కొన్నామని వారు గుర్తుచేసుకున్నారు. అభిజీత్ తల్లి అనితా దీప్కే మాట్లాడుతూ, సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు ప్రారంభం కాకముందు నుంచే తమ కుమారుడికి వివాహ సంబంధాలు వస్తున్నాయని, అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరి నాటికి అతడికి వివాహం చేయాలని తాము ఆశిస్తున్నామని, అయితే తుది నిర్ణయం అభిజీత్‌దేనని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై ఇప్పటికే తమ కుమారుడితో చర్చించినట్లు పేర్కొన్నారు. సీజేపీ స్థాపన గురించి అభిజీత్ ప్రకటించిన తర్వాత తమకు బెదిరింపు కాల్స్ వచ్చాయని, తత్ఫలితంగా దాదాపు రెండు వారాల పాటు అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అభిజీత్ బోస్టన్‌లో ఉన్నందున, భారత్‌లో నివసిస్తున్న తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుంటామని కొందరు హెచ్చరించడంతో, సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని అభిజీత్ తమకు సూచించాడని తెలిపారు. దీంతో ఛత్రపతి శంభాజీనగర్‌లోని తమ నివాసాన్ని వదిలి, కొంకణ్‌లోని బంధువుల ఇంట్లో తలదాచుకున్నట్లు అనితా దీప్కే వివరించారు.

# ప్రహ్లాద్ జోషీ రేపిస్టుల మద్దతుదారు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి నియామకంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జోషిని రేపిస్టుల మద్దతుదారుడి అభివర్ణిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలను గతంలో సమర్థించిన వ్యక్తికి కీలకమైన విద్యాశాఖను ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, "నేరస్తులను సమర్థించే వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. ప్రహ్లాద్ జోషి నియామకం మన విద్యా వ్యవస్థకు, ప్రతి విద్యార్థికి అవమానకరం" అని వ్యాఖ్యానించారు. క్యాబినెట్‌లో ఇతర సమర్థులైన మంత్రులు ఉండగా, జోషినే ఎందుకు ఎంచుకున్నారో ప్రధాని సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. రాహుల్ సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సైతం లోక్‌సభలో ఇదే అంశాన్ని ప్రస్తావించారు. గర్భిణిపై అత్యాచారం చేసిన వారి విడుదలను సమర్థించిన వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం ద్వారా దేశంలోని కోట్ల మంది విద్యార్థినులకు ప్రధాని ఎటువంటి సందేశం పంపుతున్నారని ఆమె ప్రశ్నించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ ఆరోపణలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలను అప్పగించారు. 2018లో గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులను విడుదల చేయగా, అప్పట్లో కేంద్ర మంత్రిగా ఉన్న జోషి ఆ నిర్ణయాన్ని సమర్థించారు. దోషులు జైలులో సుదీర్ఘ కాలం గడిపారని, వారి ప్రవర్తన బాగుందని ఆయన పేర్కొనడం అప్పట్లో వివాదాస్పదమైంది. అయితే, 2024లో సుప్రీంకోర్టు ఈ విడుదలను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

# కెమెరా యాంగిల్ కాదు, గుండె చూడండి

### ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక

న్యూఢిల్లీ: ప్రభుత్వం యువత (జెన్-జీ) నమ్మకాన్ని గెలుచుకోవాలంటే ప్రధాని నరేంద్ర మోదీ మార్చుకోవాల్సింది కెమెరా యాంగిల్ కాదని, తన ఆలోచనా దృక్పథాన్ని మార్చుకోవాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా లోక్‌సభలో వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, సోషల్ మీడియా వీడియోలు, కొత్త కెమెరా యాంగిల్స్‌తో యువతలో విశ్వాసాన్ని నింపలేరని పేర్కొన్నారు. "ఈ తరం యువతకు అన్నీ తెలుసు, వారికి నిజానిజాలను గుర్తించే విచక్షణ ఉంది. వారి మనసు గెలవాలంటే నిజాయతీ అవసరం" అని ప్రియాంక స్పష్టం చేశారు. ఇటీవల నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. "విద్యార్థులపై భాష్పవాయువు ప్రయోగం, లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, పెల్లెట్ గన్స్, ఏకే-47లు వాడమని ఎవరు ఆదేశించారు? వారేమైనా ఉగ్రవాదులా?" అని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆమె ప్రశ్నించారు. దీనికి యావత్ దేశం సమాధానం కోరుకుంటోందని అన్నారు. నిరసనల్లో గాయపడిన ఓ విద్యార్థినిని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో పరామర్శించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, రాజకీయ నాయకులు పదేపదే వచ్చి వీడియోలు తీస్తుండటంతో ఆ విద్యార్థిని తల్లి అనుభవించిన వేదన తనను సిగ్గుపడేలా చేసిందని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు 2024లో తీసుకొచ్చిన చట్టం కింద ఇప్పటివరకు ఒక్కరిని కూడా శిక్షించలేదని ప్రియాంక విమర్శించారు. గత దశాబ్ద కాలంలో 152 పేపర్ లీకేజీలు చోటుచేసుకుని దాదాపు 7.5 కోట్ల మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసినా, ఒక్క విద్యా మాఫియాను కూడా పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కేవలం కమిటీలు వేస్తే సరిపోదని, జాతీయ విద్యా విధానంలో మార్పులు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు.

# జార్ఖండ్‌లో 16 మంది మావోయిస్టులు లొంగుబాటు

రాంచీ: రాంచీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 16 మంది మావోయిస్టులు పోలీసులకు అధికారికంగా లొంగిపోయారు. ఈ బృందంలో ఐదుగురు మహిళా సభ్యులతో పాటు రీజినల్ కమిటీ, జోనల్ కమిటీ, సబ్-జోనల్ కమిటీ, ఏరియా కమిటీలకు చెందిన ముఖ్య నాయకులు కూడా ఉన్నారు. అలాగే లొంగిపోయిన తిరుగుబాటుదారులు తమ వద్ద ఉన్న 6 ఇన్సాస్ రైఫిళ్లు, 2 ఏకే-47 తుపాకులు, 38 మ్యాగజైన్లు, 1,562 బుల్లెట్లను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో అత్యంత కీలకమైన వ్యక్తి సీపీఐ రీజినల్ కమిటీ సభ్యుడు సంతోష్ మహతో అలియాస్ వాసుదేవ్ దా అలియాస్ దిలీప్ కూడా ఉన్నాడు. ఈయన తలపై ప్రభుత్వం రూ. 15 లక్షల రివార్డును ప్రకటించింది. పలు జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో మహతోపై ఏకంగా 128 కేసులు నమోదై ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 1వ తేదీన మనోహర్‌పూర్, ఛోట్‌నాగర్, ఝురియాకేలా సరిహద్దు అటవీ ప్రాంతంలో కోబ్రా బెటాలియన్ జవాన్‌ను తీవ్రంగా గాయపరిచిన ఐఈడీ పేలుడు ఘటనలో కూడా సంతోష్ మహతో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

# 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్' క్లోజ్

న్యూఢిల్లీ: 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్'కు అధికారికంగా ముగింపు పలికే ప్రక్రియ మొదలైంది. నిబంధనల ఉల్లంఘనలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పటికే బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేయగా, ఇప్పుడు ఆ బ్యాంక్‌ను పూర్తిగా మూసివేసే దిశగా మరో కీలక అడుగు పడింది. ఢిల్లీ హైకోర్టు 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్'ను లిక్విడేషన్‌కు పంపాలని ఆదేశించింది. దీంతో బ్యాంక్ వ్యవహారాలన్నీ ఇక అధికారిక లిక్విడేటర్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. జులై 8, జులై 22 తేదీల్లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం-1949, కంపెనీల చట్టం-2013 నిబంధనల కింద మూసివేయాలని ఆదేశించింది. కోర్టు నిర్ణయంతో బ్యాంక్ లిక్విడేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. బ్యాంక్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలన్నీ ఇక లిక్విడేటర్ చేతుల్లోకి వెళ్లాయి. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ గిరికుమార్ ఎం. నాయర్‌ను అధికారిక లిక్విడేటర్‌గా హైకోర్టు నియమించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంతో పాటు కంపెనీల చట్టం కల్పించిన అధికారాలన్నీ ఆయన వినియోగించుకోనున్నారు. జులై 8 నుంచే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డుకు ఉన్న అధికారాలన్నీ లిక్విడేటర్‌కు బదిలీ అయినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై గత కొంతకాలంగా ఆర్‌బీఐ పలు నియంత్రణ చర్యలు తీసుకుంది. పదే పదే నిబంధనలను ఉల్లంఘించడం, నియంత్రణ ప్రమాణాలను పాటించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది. డిపాజిటర్ల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా బ్యాంక్ వ్యవహారాలు సాగుతున్నాయని నిర్ధారించిన ఆర్‌బీఐ, ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసింది. అదే సమయంలో బ్యాంక్‌ను మూసివేయాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది. తాజా ఉత్తర్వులతో ఆ ప్రక్రియకు న్యాయపరమైన ముద్ర పడింది. ఇకపై పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు సంబంధించిన ఆస్తులు, బాధ్యతలు, చట్టపరమైన వ్యవహారాలన్నీ అధికారిక లిక్విడేటర్ పర్యవేక్షణలో సాగనున్నాయి. బ్యాంక్ మూసివేత ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేసే బాధ్యత కూడా ఆయనదే. ఈ పరిణామంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో ముగింపు పలికినట్లయింది.

# జపాన్‌లో 7.1 తీవ్రతతో భూకంపం

### పసిఫిక్ తీరంలో సునామీ హెచ్చరికలు జారీ




టోక్యో: జపాన్‌ను మంగళవారం భారీ భూకంపం కుదిపేసింది. దక్షిణ ప్రాంతంలోని ప్రధాన ద్వీపమైన క్యుషులోని కుమామోటో ప్రిఫెక్చర్‌లో 7.1 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం సంభవించింది. సముద్ర ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్టు జపాన్ వాతావరణ సంస్థ తెలిపింది. ఒక మీటరు (3.28 అడుగులు) ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందన్న అంచనాలతో అధికారులు సునామీ హెచ్చరిక జారీ చేశారు. తీర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత, ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని, అధికారిక సూచనలను పాటించాలని వారు కోరారు. అయితే, ఆ స్థాయి వరకు అలలు ఇప్పటికే ఎగిసిపడే ఉండొచ్చని జపాన్ ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ చీనెఖ తెలిపింది. జపాన్ దక్షిణ క్యుషు ద్వీపంలోని కుమామోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఓయిటా, మియాజాకి ప్రిఫెక్చర్‌లకు జపాన్ ప్రభుత్వం అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. నెల రోజుల వ్యవధిలో జపాన్‌లో సంభవించిన రెండో భూకంపం ఇది. జూన్ 25న ఉత్తర జపాన్‌లో 7.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం లేదా పెద్ద నష్టం జరగలేదు. జపాన్ ప్రపంచంలోనే అత్యంత భూకంపాలు సంభవించే దేశాలలో ఒకటి. ఇది పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' పశ్చిమ అంచున ఉన్న నాలుగు ప్రధాన టెక్టోనిక్ ప్లేట్లపై ఉంది. సుమారు 12.5 కోట్ల జనాభా ఉండే ఈ ద్వీపసమూహంలో, సాధారణంగా ఏటా వందలాది ప్రకంపనలు సంభవిస్తాయి. ప్రపంచంలోని భూకంపాలలో సుమారు 18 శాతం ఇక్కడే సంభవిస్తాయి. వాటిలో అత్యధిక శాతం తేలికపాటివే, అయినప్పటికీ అవి సంభవించే ప్రదేశం, భూమి ఉపరితలం క్రింద ఎంత లోతులో సంభవిస్తాయనే దానిని బట్టి నష్టం మారుతూ ఉంటుంది. 2011లో 9.0 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం చేదు జ్ఞాపకం ఇంకా జపాన్‌ను వెంటాడుతోంది. ఆ భూకంపం తర్వాత వచ్చిన సునామీలో సుమారు 18,500 మంది మరణించారు. ఫుకుషిమా దైచీ అణు కర్మాగారం ధ్వంసమైంది. అలాగే, ఈ ఏడాది ఏప్రిల్ 20న కూడా ఉత్తర జపాన్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించి, కనీసం 10 మంది గాయపడ్డారు. టోక్యోలోని భారీ భవనాలు కంపించాయి. దీంతో, 8.0 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రతతో భూకంపాలు వచ్చేటప్పుడు జారీచేసే ప్రత్యేక హెచ్చరికలను అధికారులు జారీ చేశారు. వారం రోజుల తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించారు. ఇదిలా ఉండగా, జూన్ 24న వెనుజులాపై కొద్ది క్షణాల్లోనే రెండు శక్తివంతమైన భూకంపాలు విరుచుకుపడి.. వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అదే రోజు జపాన్‌లోనూ భూకంపం వచ్చింది.

# ఒకే రోజు 10 మంది గల్లంతు

### ఇంటి నుంచి బయటకు వెళ్లగానే మాయం, ఫోన్లు స్విచ్ఛాఫ్

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకే రోజు 10 మంది కనిపించకుండా పోవడం స్థానికంగా కలకలం రేపింది. బాధితుల కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదుల ఆధారంగా స్థానిక పోలీసులు వెంటనే అదృశ్యం కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లిన వెంటనే అందరి ఫోన్లు ఆఫ్‌లోకి వెళ్లడంతో పోలీసుల శోధన ప్రక్రియ తీవ్ర సవాలుగా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ అదృశ్యమైన 10 మందిలో ముగ్గురు మైనర్లు ఉన్నారు. ప్రధానంగా కోలార్, అయోధ్య నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోనే అధిక సంఖ్యలో ఫిర్యాదులు నమోదు అయ్యాయి. అశోకా గార్డెన్‌లో తరగతులకు హాజరు అయ్యేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఓ 17 ఏళ్ల విద్యార్థి తిరిగి ఇంటికి రాలేదు. అలాగే అయోధ్య నగర్ నుంచి 19 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు వ్యక్తులు అదృశ్యం అయ్యారు. ఇక కోలార్‌లో 20 ఏళ్ల యువకుడితో పాటు 40, 45 ఏళ్ల వయసున్న ఇద్దరు వ్యక్తుల ఆచూకీ లభించడం లేదు. అంతేకాకుండా నగరంలోని ఇతర ప్రాంతాలైన టీటీ నగర్, రతిబాద్, అవధ్‌పురి ప్రాంతాల నుంచి ఒక్కొక్కరి చొప్పున మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయి. హఠాత్తుగా పెరిగిన ఈ మిస్సింగ్ కేసులపై భోపాల్ పోలీస్ యంత్రాంగం నిశిత దృష్టి సారించింది. అదృశ్యమైన వారు ప్రయాణించిన మార్గాల్లోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను సైబర్, రక్షక దళాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. మాయమైన వారి చివరి మొబైల్ లొకేషన్ ఆధారంగా ఆధారాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు ఎవరైనా ఈ వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఒకే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లి పది మంది కనిపించకుండా పోవడం స్థానికంగానే కాకుండా దేశవ్యాప్తంగానూ సంచలనం రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలోనూ తెగ వైరల్ అవుతుండగా.. అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు భోపాల్‌లో ఏం జరుగుతుందో అని అంతా పోలీసులను ప్రశ్నిస్తున్నారు.

# సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

### మయన్మార్‌లో కొత్త చట్టం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
బుధవారం 30-7-2026, జగిత్యాల
www.evarthalu.com






## లవ్ స్టోరీలు అంటే నాకు పిచ్చి: నాగ చైతన్య

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన సినిమా ‘ చెన్నై లవ్ స్టోరీ ‘. సాయి రాజేష్, ఎస్కేఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. 3 రోజుల్లోనే 40.1 కోట్ల రూపాయలు రాబట్టింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో గ్రాండ్ సక్సెస్ మీట్ నిర్వహించారు. దీనికి అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగచైతన్య మాట్లాడుతూ.. “ఈ ఈవెంట్ కు వచ్చినందుకు టీమంతా నాకు థ్యాంక్స్ చెబుతున్నారు. నాకు థ్యాంక్స్ చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సక్సెస్ ను సెలబ్రేట్ చేసుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ‘చెన్నై లవ్ స్టోరీ’ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కు రమ్మని సాయి రాజేష్ కాల్ చేశాడు. నేను వేరే కమిట్మెంట్ వల్ల వెళ్లలేకపోయాను. అప్పుడు చాలా బాధపడ్డాను. ఈ సినిమా సక్సెస్ అయ్యాక కాదు, సక్సెస్ కు ముందే ఈ మూవీని ప్రమోట్ చేయాలని నా మనసులో ఉండేది. ఎందుకంటే నాకు పర్సనల్ గా లవ్ స్టోరీస్ అంటే పిచ్చి. కోవిడ్ తర్వాత లవ్ స్టోరీలు తగ్గిపోతుంటే ఒకానొక సమయంలో నాకు భయమేసింది. లవ్ సినిమాలు చూడటానికి ఆడియన్స్ థియేటర్లకు వెళ్తారా? అని ఆలోచించా. మెల్లిగా ఆ ట్రెండ్ మళ్లీ స్టార్ట్ అయింది. ‘చెన్నై లవ్ స్టోరీ’తో ఇండస్ట్రీకి మరో కల్ట్ లవ్ స్టోరీ ఇచ్చారు. నాకు ఎంతో హ్యాపీగా ఉంది” అని అన్నారు.

## రిజర్వేషన్ పోస్ట్ ఫేక్: శిల్పా శెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. “జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి



వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు” అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రచారంపై శిల్పాశెట్టి ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. “రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి” అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.



## ‘ఆదర్శ కుటుంబం’లో నివేదా పేతురాజ్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘ఆదర్శ కుటుంబం’ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, “ఆడది అంటే ఇలా నవ్వాలి” అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి “ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం” అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది. ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.




## 2:35 గంటల రన్‌టైంతో ‘శ్రీనివాస మంగాపురం’

ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’ రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. “సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ” అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథపై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ‘ఆర్‌ఎక్స్ 100’ చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రంతో ఘట్టమనేని కుటుంబం నుంచి జైకృష్ణ హీరోగా తెలుగు తెరకు పరిచయం కానుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఇదే సినిమాతో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కూడా టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన అప్ డేట్స్ ద్వారా జయకృష్ణ ఘట్టమనేని, రాషా కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటోంది.



## పావలా శ్యామల కన్నుమూత

ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన ‘బాబాయ్ అబ్బాయ్’ చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని ‘స్వర్ణకమలం’ సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత ‘ఖడ్గం’, ‘ఆంధ్రావాలా’, ‘అతడు’, ‘గోలీమార్’ వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు. ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు.

## ఐటెం సాంగ్‌లో కీర్తి సురేష్



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన ‘నేను లోకల్’ మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి.



# జడ్డూ వచ్చేశాడు!

## శ్రీలంక టెస్టు సిరీస్‌కు భారత జట్టు ఖరారు

### సారాంశ్ జైన్‌కు తొలి పిలుపు.. ఆగస్టు 7 నుంచి ప్రాక్టీస్ మ్యాచ్

శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. గాయం నుంచి కోలుకున్న స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా జట్టులోకి తిరిగి వచ్చాడు. ఐపీఎల్-2026 సమయంలో టెన్నిస్ ఎల్బో గాయంతో జట్టుకు దూరమైన అతడు, పూర్తిగా కోలుకున్నాడు. ఇంగ్లండ్ వన్డే సిరీస్‌లో తొడ కండరాల గాయంతో వాషింగ్టన్ సుందర్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. అతడి స్థానంలో మధ్యప్రదేశ్‌కు చెందిన స్పిన్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌కు తొలిసారి భారత జట్టులో అవకాశం లభించింది. ఇటీవల శ్రీలంక-ఏతో జరిగిన మ్యాచుల్లో ఆకట్టుకున్న సారాంశ్ జైన్ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 42 మ్యాచ్‌లు ఆడిన అతడు 131 వికెట్లు పడగొట్టాడు. బ్యాట్‌తో కూడా 1,455 పరుగులు చేసి ఆల్‌రౌండర్‌గా తన సత్తా చాటాడు. దీంతో వాషింగ్టన్ సుందర్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడిగా అతణ్ని ఎంపిక చేశారు. శ్రీలంక పర్యటనకు ముందు భారత జట్టు ఆగస్టు 7 నుంచి కొలంబోలో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలేలో, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలో జరుగుతుంది. మరోవైపు సాయి సుదర్శన్, జస్ప్రీత్ బుమ్రా తుది ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చిన తర్వాతే మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని బీసీసీఐ వెల్లడించింది.



**భారత జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మనవ్ సుథార్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సారాంశ్ జైన్

# వైభవ్‌ది బ్రాడ్‌మన్ టెక్నిక్: ఊతప్ప

భారత క్రికెట్‌లో ప్రస్తుతం ఓ యువ సంచలనం పేరు మారుమోగిపోతోంది. అతడే వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన ఈ టీనేజ్ బ్యాటర్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు, ఐపీఎల్ విజేత రాబిన్ ఊతప్ప.. వైభవ్ బ్యాటింగ్ శైలిని ఏకంగా క్రికెట్ దిగ్గజం సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌తో పోల్చి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన ఊతప్ప, వైభవ్



బ్యాటింగ్ టెక్నిక్‌లో బ్రాడ్‌మన్ ఛాయలు కనిపిస్తున్నాయని విశ్లేషించాడు. "బ్రాడ్‌మన్ ఆడుతున్నప్పుడు అతడిని కట్టడి చేసేందుకు బౌలర్లు బాడీలైన్ బౌలింగ్ ప్రయోగించేవారు. ఇప్పుడు వైభవ్ విషయంలోనూ అదే జరుగుతోంది. వీరిద్దరి టెక్నిక్‌లో ఒకేరకమైన పోలిక ఉంది. బ్రాడ్‌మన్‌లాగే వైభవ్‌ను కూడా ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేయడం దాదాపు అసాధ్యం" అని ఊతప్ప వివరించాడు. వైభవ్ కెరీర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, బౌలర్లు అతడిని ఎదుర్కోవడానికి ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నారని పేర్కొన్నాడు. అయితే, ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని ఊతప్ప అభిప్రాయపడ్డాడు. "బౌలర్లు వైభవ్ బ్యాటింగ్‌కు ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతానికి అతని ఆటతీరును అందరూ అర్థం చేసుకుంటున్నారు. వైభవ్ తన అద్భుతమైన స్ట్రైక్‌రేట్‌తో పాటు 40లలో బ్యాటింగ్ సగటును కొనసాగించగలిగితే, అతడు కచ్చితంగా ఒక 'అవుట్‌లయర్' (సాధారణ పద్ధతులకు భిన్నంగా అద్భుతంగా రాణించే ఆటగాడు) అవుతాడు" అని అన్నారు.



# షర్మిల.. పసిడి పట్టేసింది!



**పోలియో రాకసి రూపంలో వచ్చిన వైకల్యాన్ని.. పెండ్లి రూపంలో ఎదురైన కష్టాలను అధిగమించి క్రీడలకు రిటైర్మెంట్ ఇచ్చే 34 ఏండ్ల లేటు వయసులో కెరీర్ ఆరంభించిన ధీర వనిత షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. మెగా గేమ్స్ చరిత్రలో పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది.**

మహిళల పారా షాట్‌పుట్‌లో షర్మిల స్వర్ణం గెలవగా.. ఇదే పోటీలో శిల్పా శైలా కాంస్యంతో మురిసింది. ఇంకోవైపు తండ్రి బాటలో పయనించిన తెలుగు వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హై జంపర్ సర్వేశ్ కుశారే రజతాలతో మెరడంతో కామన్వెల్త్‌తో భారత పతకాల సంఖ్య పదికి చేరింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్‌లో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి గోల్డ్ సొంతం చేసుకుంది. 20 ఏండ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పసిడి కావడం విశేషం. శిల్ప 7.26 మీటర్ల త్రో చేసి కాంస్యం అందుకుంది. తొలుత నైజీరియాకు చెందిన యుకారియా ఇయాజీ మూడో స్థానంలో నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, భారత్ నిరసనతో నిర్వహించిన రివ్యూలో నైజీరియా అథ్లెట్ ఫౌల్ చేసినట్టు తేలడంతో శిల్పకే కాంస్యం దక్కింది. ఇక, పురుషుల హైజంప్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న సర్వేశ్ కుశారే రజతం అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకా జంపర్ రొమైన్ బెక్‌ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్లు ఎత్తు దూకారు. కానీ, 2.28 మార్కును అధిగమించలేకపోయారు. విజేతను తేల్చేందుకు అంతకుముందు చేసిన ప్రయత్నాల్లో ఇద్దరు అథ్లెట్ల వైఫల్యాలను (కౌంట్ బ్యాక్) లెక్కించారు. ఒకేసారి విఫలమైన బెక్‌ఫోర్డ్ స్వర్ణం అందుకోగా.. రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్ రజతంతో సంతృప్తి చెందాడు. అయినా కామన్వెల్త్ గేమ్స్ హైజంప్‌లో సిల్వర్ నెగ్గిన భారత అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు.

### ఒక్క కేజీ తేడాతో అజయ్‌కు గోల్డ్ మిస్

ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79కేజీ కేటగిరీలో సిల్వర్ నెగ్గాడు. 21 ఏండ్ల అజయ్ ఫైనల్లో మొత్తం 330 కిలోల బరువెత్తి రెండో స్థానం సాధించాడు. 145 కిలోలతో స్నాచ్‌ను ఆరంభించిన అజయ్ రెండో ప్రయత్నంలో విఫలమైనా చివరగా 149కిలోల బరువు మోసి గేమ్స్ రికార్డు సృష్టించాడు. క్లీన్ అండ్ జర్క్‌లో గోల్డ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. 181 కేజీలను క్లియర్ చేసినా ఒక్క కిలో తేడాతో కొద్దిలో స్వర్ణం కోల్పోయాడు. మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 (147o184) కేజీలతో పసిడి సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీ) కాంస్యం అందుకున్నాడు. కాగా, మహిళల 63 కిలోల విభాగంలో నిరుపమ నిరాశపరిచింది.



# మలబార్ గోల్డ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోనీ

ప్రముఖ జ్యువెలరీ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీని నియమించుకున్నట్లు ప్రకటించింది. 'ది రెస్పాన్సిబుల్ జ్యువెలర్' అనే తమ బ్రాండ్ ఫిలాసఫీని బలోపేతం చేయడంలో భాగంగా ఈ దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ ముంబైలో తెలిపింది. వినియోగదారులు పారదర్శకత, విశ్వసనీయతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఈ తరుణంలో, తమ నిబద్ధతను చాటుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మలబార్ గోల్డ్ పేర్కొంది. నైతిక వ్యాపార పద్ధతులు, నాణ్యత, పారదర్శక ధరలు, కస్టమర్-ఫస్ట్ విధానాల ద్వారా ప్రతి కొనుగోలులోనూ నమ్మకాన్ని అందించడమే తమ లక్ష్యమని వివరించింది. భారత జట్టుకు మూడు ఐసీసీ వైట్-బాల్ టోర్నమెంట్‌లలో టైటిళ్లు అందించిన ఏకైక కెప్టెన్‌గా చరిత్ర సృష్టించిన ఎంఎస్ ధోనీ... తన నిజాయతీ, క్రమశిక్షణ, నిలకడతో కోట్లాది మంది అభిమానుల మనసు గెలుచుకున్నారు. ధోనీ వ్యక్తిత్వం తమ 33 ఏళ్ల బ్రాండ్ విలువలకు అద్దం పడుతుందని సంస్థ అభిప్రాయపడింది. ఈ ఒప్పందంలో భాగంగా టెలివిజన్, ప్రింట్, డిజిటల్ వంటి అన్ని మాధ్యమాల్లో భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ భాగస్వామ్యంపై మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహమ్మద్ మాట్లాడుతూ... "వినియోగదారులు తాము ఎంచుకునే బ్రాండ్ల నుంచి కేవలం ఉత్పత్తులనే కాదు, పారదర్శకతను, విశ్వసనీయతను కూడా ఆశిస్తున్నారు.

## డైరెక్ట్ త్రో కొడితేనే చోటు..

# కైఫ్ రూల్: రైనా

భారత క్రికెట్ జట్టులో తన తరం ఆటగాళ్లు అత్యుత్తమ ఫీల్డింగ్ యూనిట్‌గా ఎలా మారారో మాజీ ఆల్‌రౌండర్ సురేశ్ రైనా గుర్తుచేశాడు. కఠోరమైన ప్రాక్టీస్, క్రమశిక్షణ, సీనియర్ ఆటగాళ్ల నుంచి నేర్చుకున్న పాఠాలే తమను ప్రపంచంలోనే మేటి ఫీల్డర్లుగా తీర్చిదిద్దాయని అన్నాడు. ఆనాటి ఫీల్డింగ్ కల్చర్, తన కెరీర్‌ను మలుపు తిప్పిన కొన్ని సంఘటనలను రైనా గుర్తుచేసుకున్నాడు. ఓ ఇంటర్వ్యూలో రైనా మాట్లాడుతూ.. "మేం ఒక ప్రత్యేకమైన ఫీల్డింగ్ కల్చర్‌ను సృష్టించుకున్నాం. ప్రాక్టీస్ సెషన్‌లో మొదట ఉండేది ఫీల్డింగే. అందుకే ఆటగాళ్లందరూ అరగంట ముందే మైదానంలోకి వచ్చేవారు. ఇప్పటిలా కొన్ని క్యాచ్‌లు పట్టి అయిపోయిందని అనుకునేవాళ్లం కాదు. హై క్యాచ్‌లు, గ్రౌండ్ ఫీల్డింగ్, స్లిప్ క్యాచ్‌లు, ప్యారలల్ క్యాచ్‌లు.. ఇలా ప్రతీదీ విడివిడిగా ప్రాక్టీస్ చేసేవాళ్లం. అప్పట్లో మహ్మద్ కైఫ్ మా యూపీ జట్టుకు కెప్టెన్‌గా ఉండేవాడు. 'సింగిల్ వికెట్‌ను డైరెక్ట్‌గా త్రో కొడితేనే తుది జట్టులో చోటు ఉంటుంది' అని చెప్పేవాడు" అని తెలిపాడు. ఫీల్డింగ్ దిగ్గజం జాంటీ రోడ్స్‌ను ఆరాధించేవాడినని, ఉత్తరప్రదేశ్ జట్టులో కైఫ్, భారత జట్టులో యువరాజ్ సింగ్ నుంచి ఎంతో నేర్చుకున్నానని రైనా అన్నాడు. "కైఫ్, యువీ పాయింట్, కవర్‌లో ఫీల్డింగ్ చేస్తుంటే నేను మిడ్-ఆఫ్‌లో ఉండేవాడిని. మేం ముగ్గురం కలిసి బంతిని దాటనిచ్చేవాళ్లం కాదు" అని చెప్పాడు. ఇదే క్రమంలో సిడ్నీలో ఇర్ఫాన్ పఠాన్‌తో జరిగిన ప్రమాదాన్ని రైనా గుర్తుచేసుకున్నాడు. "ఆస్ట్రేలియా పర్యటనలో జడేజా బౌలింగ్‌లో డేవిడ్ వార్నర్ స్వీప్ షాట్ ఆడగా బంతి గాల్లోకి లేచింది. మిడ్-వికెట్‌లో ఉన్న నేను పరుగెత్తాను. ఫైన్ లెగ్ నుంచి ఇర్ఫాన్ కూడా వస్తున్నాడనే విషయం నాకు తెలియదు. నా దృష్టి అంతా బంతిపైనే ఉంది. క్యాచ్ పూర్తి చేయగానే ఇర్ఫాన్‌ను బలంగా ఢీకొట్టాను. అదృష్టవశాత్తు నా భుజం మాత్రమే తగిలింది. కానీ, ఆ ప్రమాదంలో ఇర్ఫాన్ పక్కటెముక విరిగింది. అతను తీవ్రంగా గాయపడ్డాడు.





## 5 మెయిడిన్ ఓవర్లు..

# 5 వికెట్లు

### పాక్‌తో టెస్టులో వెస్టిండీస్ పేసర్ గ్రీవ్స్ రికార్డు

స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ పేసర్ జస్టిన్ గ్రీవ్స్ (5/27)రికార్డు ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను గజగజ వణికించాడు. వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా 5 వికెట్లు పడగొట్టి పాక్ వెన్నువిరిచాడు. గ్రీవ్స్ పేస్ మ్యాజిక్‌తో తొలి ఇన్నింగ్స్ ఒక దశలో 62.5 ఓవర్లకు 244/3తో ఉన్న పాక్.. ఏడు ఓవర్ల వ్యవధిలోనే ఆరు వికెట్లు కోల్పోయి 267/9తో నిలిచింది. 64వ ఓవర్లో బంతినందుకున్న గ్రీవ్స్.. మొదట షాన్ మసూద్ (109)ను ఔట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో అలి ఉస్మాన్, జమాల్, రిజ్వాన్, అబ్బాస్‌ను ఔట్ చేసి తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# యువశక్తి.. దారి ఎటు?

ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశం ఏది? అనే ప్రశ్నకు నేడు సమాధానం భారత్. ఇది కేవలం గణాంకం కాదు; ప్రపంచ దేశాలకు లేని ఒక అపూర్వ అవకాశం. అభివృద్ధి చెందిన అనేక దేశాలు వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొంటున్న సమయంలో, భారతదేశంలో పని చేసే వయస్సులో ఉన్న జనాభా అత్యధికంగా ఉండటం మనకు లభించిన గొప్ప వరం. దీనినే ఆర్థికవేత్తలు "జనాభా లాభం" (డెమోగ్రఫిక్ డివిడెండ్) అని పిలుస్తారు. అయితే ఈ అవకాశం శాశ్వతం కాదు. సరైన విధానాలు, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించగలిగితేనే ఇది దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది. లేకపోతే ఇదే జనాభా నిరుద్యోగం, అసమానతలు, సామాజిక అస్థిరతకు కారణమయ్యే ప్రమాదం ఉంది. జనాభా లాభం అంటే పని చేసే వయస్సు (సాధారణంగా 15-64 సంవత్సరాలు) గల జనాభా, ఆధారపడే చిన్నారులు, వృద్ధుల కంటే ఎక్కువగా ఉండే పరిస్థితి. ఈ దశలో ఎక్కువ మంది ఉత్పాదక కార్యకలాపాల్లో పాల్గొంటే దేశ ఆదాయం పెరుగుతుంది, పన్నుల వసూళ్లు పెరుగుతాయి, పొదుపు పెరుగుతుంది, పెట్టుబడులు పెరుగుతాయి. ఫలితంగా ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుంది. ప్రపంచంలో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, చైనా వంటి దేశాలు ఒకప్పుడు తమ జనాభా లాభాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని వేగంగా అభివృద్ధి చెందాయి. నేడు ఆ దేశాలు వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు అలాంటి అవకాశమే భారతదేశం ముందు ఉంది. ఈ అవకాశాన్ని కోల్పోతే మరోసారి అదే స్థాయిలో దక్కడం చాలా కష్టం. భారత్ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం సాధించాలంటే యువశక్తిని ఉత్పాదక శక్తిగా మార్చడం అత్యంత కీలకం. కేవలం యువ జనాభా ఎక్కువగా ఉండటం సరిపోదు; వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం ఉండాలి. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నిరుద్యోగం ,నైపుణ్యాల మధ్య అంతరం. ప్రతి సంవత్సరం లక్షలాది మంది డిగ్రీలు పూర్తి చేస్తున్నప్పటికీ, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువత కొరత ఉందని సంస్థలు చెబుతున్నాయి. మరోవైపు లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితి జనాభా లాభాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నామనే సంకేతం. నేటి ప్రపంచంలో ఉద్యోగాల స్వభావం వేగంగా మారుతోంది. కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, రోబోటిక్స్, డ్రోన్స్, గ్రీన్ ఎనర్జీ, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయి. విద్యా వ్యవస్థ కూడా ఈ మార్పులకు అనుగుణంగా మారాలి. పాత సిలబస్‌లతో కాకుండా భవిష్యత్ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. భారత్‌కు లభించిన ఈ జనాభా లాభం శాశ్వతం కాదు. రాబోయే రెండు నుంచి మూడు దశాబ్దాలే ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకునే కీలక కాలం. ఈ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటే భారతదేశం ప్రపంచంలో అగ్ర ఆర్థిక శక్తిగా ఎదగగలదు. లేదంటే నిరుద్యోగం, అసమానతలు, సామాజిక అసంతృప్తి వంటి సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

ఒకప్పుడు మాదకద్రవ్యాల వినియోగం కొంతమంది వ్యక్తులకు, కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది. కానీ నేడు అది పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా విస్తరిస్తున్నదనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం చట్టపరమైన సమస్య కాదు; కుటుంబాలు, విద్యా వ్యవస్థ, ఆరోగ్యం, సమాజం, దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన సామాజిక సమస్య. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఈ యువశక్తి సరైన దిశలో ప్రయాణిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది. కానీ అదే యువత మాదకద్రవ్యాలకు బానిసైతే దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారుతుంది. మాదకద్రవ్యాల వ్యసనం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, అతని కుటుంబాన్ని, స్నేహితులను, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మాదకద్రవ్యాలకు యువత ఆకర్షితులవడానికి అనేక కారణాలు ఉన్నాయి.


# ఒక మత్తు.. ఒక తప్పు



స్నేహితుల ఒత్తిడి, "ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమవుతుంది?" అనే నిర్లక్ష్య ధోరణి, సోషల్ మీడియా ప్రభావం, సినిమాల్లో మత్తును ఆకర్షణీయంగా చూపించడం, కుటుంబ సమస్యలు, ఒంటరితనం, పరీక్షల ఒత్తిడి, నిరుద్యోగం, మానసిక ఆందోళనలు.. ఇవన్నీ కలిసి యువతను ప్రమాదకరమైన దారిలోకి నెడుతున్నాయి. మొదట సరదాగా ప్రారంభమైన అలవాటు, క్రమంగా వ్యసనంగా మారి జీవితాన్నే కబళిస్తుంది. మాదకద్రవ్యాల ప్రభావం శారీరక ఆరోగ్యానికే పరిమితం కాదు. మెదడు పనితీరు దెబ్బతింటుంది. ఏకాగ్రత తగ్గిపోతుంది. జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం బలహీనపడుతుంది. తీవ్రమైన సందర్భాల్లో మానసిక రుగ్మతలు, డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనలు కూడా పెరిగే ప్రమాదం ఉంది. చదువు మధ్యలో ఆగిపోవడం, ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం, కుటుంబాలతో విభేదాలు, నేరాలకు పాల్పడే పరిస్థితులు కూడా ఏర్పడవచ్చు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ భద్రతతో కూడా ముడిపడి ఉంది. డ్రగ్స్ వ్యాపారం ద్వారా సంపాదించే అక్రమ ధనం సంఘటిత నేరాలు, అక్రమ ఆయుధాల వ్యాపారం, ఇతర నేర కార్యకలాపాలకు బలం చేకూర్చే అవకాశం ఉంది. అందువల్ల డ్రగ్స్ సమస్యను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా, చట్టం-శాంతిభద్రతల సమస్యగా కూడా చూడాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా డ్రగ్స్‌కు సంబంధించిన కేసులు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, పబ్బులు, పార్టీలు, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ల ద్వారా మాదకద్రవ్యాలు యువతకు చేరుతున్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. పోలీసులు అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, సరఫరా మార్గాలు మారుతూ ఉండటం కొత్త సవాళ్లను సృష్టిస్తోంది. డ్రగ్స్‌ను అరికట్టాలంటే సరఫరా గొలుసును ఛేదించడం ఎంత ముఖ్యమో, డిమాండ్‌ను తగ్గించడం కూడా అంతే ముఖ్యం.

ఇక్కడ కుటుంబాల పాత్ర అత్యంత కీలకం. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారి ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు, చదువుపై ఆసక్తి తగ్గడం, అనుమానాస్పద స్నేహాలు, అధిక ఖర్చులు, ఒంటరిగా ఉండటం వంటి సంకేతాలను గమనించాలి. కఠినంగా మందలించడం కంటే, వారి సమస్యలను అర్థం చేసుకొని సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం అవసరం. పిల్లలకు సమయం కేటాయించే కుటుంబాల్లో వ్యసనాల ప్రమాదం తక్కువగా ఉంటుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. విద్యాసంస్థలు కూడా కేవలం పాఠాలు చెప్పడానికే పరిమితం కాకూడదు. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, చట్టపరమైన, సామాజిక నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలి. క్రీడలు, కళలు, సృజనాత్మక కార్యకలాపాలు, స్వచ్ఛంద సేవలలో యువతను భాగస్వామ్యం చేయడం ద్వారా వారికి సానుకూల దిశను చూపించవచ్చు. ప్రభుత్వాలు, పోలీసు శాఖలు, నార్కోటిక్స్ నియంత్రణ సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాలి. సరిహద్దులు, రవాణా మార్గాలు, ఆన్‌లైన్ అక్రమ విక్రయాలపై నిఘా పెంచాలి. అదే సమయంలో వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్థులుగా కాకుండా, చికిత్స మరియు పునరావాసం అవసరమైన వ్యక్తులుగా కూడా చూడాలి. సమర్థవంతమైన డీ-అడిక్షన్ కేంద్రాలు, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉండాలి. మీడియా, సినిమా, సోషల్ మీడియా వేదికలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మత్తును గొప్పగా చూపించే కథనాలు, దానిని ఫ్యాషన్‌గా చిత్రీకరించే ధోరణి యువతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అదే సమయంలో వ్యసనాల ప్రమాదాలపై అవగాహన పెంచే ప్రచారాలు మరింత విస్తృతంగా నిర్వహించాలి. సమాజం కూడా వ్యసనానికి గురైన యువతను పూర్తిగా దూరం పెట్టకుండా, తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి సహకరించాలి. పునరావాసం పొందిన వారికి విద్య, ఉపాధి, సామాజిక మద్దతు అందించడం కూడా వ్యసన నిర్మూలనలో ముఖ్యమైన భాగం. మాదకద్రవ్యాల సమస్యకు శాశ్వత పరిష్కారం కేవలం కఠిన శిక్షల్లో లేదు. కుటుంబంలో ప్రేమ, విద్యలో విలువలు, సమాజంలో అవగాహన, ప్రభుత్వంలో కఠిన అమలు, యువతలో ఆత్మవిశ్వాసం.. ఈ ఐదు కలిసి పనిచేసినప్పుడే ఫలితం కనిపిస్తుంది. ఒక దేశ సంపద కేవలం దాని సహజ వనరులు కాదు; దాని యువశక్తి. ఆ యువశక్తిని మాదకద్రవ్యాల మత్తు నుంచి కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి ప్రభుత్వ సంస్థ, ప్రతి పౌరుడి బాధ్యత. మత్తు క్షణిక ఆనందాన్ని ఇవ్వవచ్చు; కానీ దాని మూల్యం ఒక జీవితకాలం చెల్లించాల్సి వస్తుంది. మాదకద్రవ్యాలకు "కాదు" అని చెప్పగల ధైర్యమే యువతకు నిజమైన స్వేచ్ఛ, కుటుంబాలకు నిజమైన భద్రత, దేశానికి నిజమైన భవిష్యత్తు.

**- కిరణ్ కుమార్, చొప్పదండి (కరీంనగర్)**



# వ్యాస మహర్షిని పూజిస్తే గురువు అనుగ్రహం

సనాతన హిందూ సంప్రదాయంలో గురువుకు తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానం కల్పించారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమిని గురు పూర్ణిమ లేదా వ్యాస పూర్ణిమగా ఆచరిస్తారు. ఈ సందర్భంగా గురువులను, వ్యాస మహర్షిని భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది గురు పూర్ణిమను బుధవారం భక్తులు ఘనంగా జరుపుకోనున్నారు.

పురాణాల ప్రకారం మహర్షి వేదవ్యాసుడు ఈ రోజునే అవతరించినట్లు విశ్వసిస్తారు. వేదాలను విభజించి, మహాభారతాన్ని రచించిన వ్యాస మహర్షికి నివాళిగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. గురు పూర్ణిమ రోజున గురువును, వ్యాస మహర్షిని ఆరాధించే వారికి అష్టైశ్వర్యాలు, జ్ఞానం, ఐశ్వర్యం, శుభఫలితాలు కలుగుతాయని పండితులు పేర్కొంటున్నారు. హిందూ సంప్రదాయంలో ప్రసిద్ధమైన "గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః, గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః" అనే శ్లోకం గురువు మహిమాన్విత స్థానాన్ని తెలియజేస్తుంది. ఇదే సమయంలో ప్రారంభమయ్యే చాతుర్మాస దీక్షలో యతులు ఒకే ప్రాంతంలో నివసిస్తూ శిష్యులకు ధర్మబోధ, జ్ఞానబోధ చేస్తారు. అందువల్ల గురు పూర్ణిమకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

పురాణ కథనం ప్రకారం, వారణాసిలో వేదనిధి, వేదవతి అనే భక్తిశ్రద్ధలు కలిగిన బ్రాహ్మణ దంపతులు నివసించేవారు. వారికి సంతానం లేకపోవడంతో అనేక వ్రతాలు, నోములు చేసినా ఫలితం దక్కలేదు. ఇదే సమయంలో వ్యాస మహర్షి ప్రతిరోజూ రహస్యంగా గంగానదికి స్నానానికి వస్తారని తెలిసిన వేదనిధి, ఆయన దర్శనం కోసం ఎదురుచూశాడు. ఒకరోజు భిక్షువు వేషంలో వచ్చిన వ్యాస మహర్షిని గుర్తించిన వేదనిధి, ఆయన పాదాలపై పడి నమస్కరించి తన ఇంటికి పితృకార్యానికి అతిథిగా రావాలని ఆహ్వానించాడు. మరుసటి రోజు వ్యాస మహర్షి వారి ఇంటికి చేరుకోగా, దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆతిథ్యం ఇచ్చి పూజలు నిర్వహించారు. వారి సేవాభావానికి సంతోషించిన వ్యాస మహర్షి కోరిన వరాన్ని ప్రసాదిస్తానని చెప్పగా, తమకు సంతానభాగ్యం కలిగించాలని దంపతులు ప్రార్థించారు. వారి భక్తికి మెచ్చిన మహర్షి త్వరలోనే తేజోవంతులైన, ఐశ్వర్యవంతులైన పది మంది కుమారులు జన్మిస్తారని ఆశీర్వదించారని పురాణాలు వివరిస్తున్నాయి. అనంతరం ఆ దంపతులు సంతానసౌభాగ్యంతో సుఖసంతోషాల జీవితం గడిపి చివరికి విష్ణుసాయుజ్యాన్ని పొందినట్లు కథనం పేర్కొంటుంది. ఈ పురాణ గాథ గురు పూర్ణిమ రోజున గురువును, ముఖ్యంగా వ్యాస మహర్షిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే వారి అనుగ్రహం లభిస్తుందనే విశ్వాసానికి నిదర్శనంగా భావిస్తారు. అందుకే ఈ పర్వదినాన గురుపూజ, గురుదక్షిణ, గురువుల ఆశీర్వాదం పొందడం హిందూ సంప్రదాయంలో విశిష్ట ఆచారంగా కొనసాగుతోంది.



**రాం మనోహర్ శర్మ**
8106194150
ఆధ్యాత్మిక పండితుడు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.